వార్త

ఆదివారం

27 సెప్టెంబరు, 2026



# మహిళా వికాసమే ప్రగతికి సోపానం

# 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ

తారాతీరం

మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.

పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.

ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.



ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. 'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో ఈ సినిమా కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి.

మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు.

# 'రణబాలి' అక్టోబరులో విడుదల!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రీకరణ పూర్తయింది. ఈ విషయాన్ని దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాల నడుమ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టిసిరీస్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపు దిద్దుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

విడుదలకు చాలా ముందే సినిమా సిద్ధమవుతుందని, ఇప్పటికే మొదటి భాగం నేపథ్య సంగీతం (బీజీఎం) కూడా పూర్తయిందని చిత్రబృందం తెలిపింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్, రష్మిక కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న 'జయమ్మ' పాత్రకు తన తల్లి పేరు పెట్టుకున్నట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఇటీవల వెల్లడించారు. "రణబాలి గుండెల్లో ప్రేమగా, ఆత్మలో స్ఫూర్తిగా, వెన్నెముకలో ధైర్యంగా, అతని పిచ్చిలో మాధుర్యంగా జయమ్మ పాత్ర ఉంటుంది" అని ఆయన అభివర్ణించారు. రష్మిక తన నటనతో జయమ్మ పాత్రకు ప్రాణం పోయడమే కాకుండా ఆ పాత్రను శాశ్వతంగా నిలిచిపోయేలా చేసిందని ప్రశంసించారు.



19వ శతాబ్దం నేపథ్యంలో 1854 -1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' తీర్చిదిద్దారు. బ్రిటిష్ పాలకులు చరిత్ర పుస్తకాలలో తప్పుగా చూపించిన లేదా పూర్తిగా తుడిచిపెట్టిన ఎన్నో నిజాలను ఈ సినిమా ద్వారా వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ 'రణబాలి'గా నటిస్తుండగా, 'ది మమ్మీ' ఫేమ్ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ 'సర్ థియోడర్ హెక్టర్' అనే కీలక ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.

ఆదివారం వార్త

27 సెప్టెంబరు, 2026

# కదంబం

'సంఘీ'భావం....5

కబ్జాలకు ముగింపు ఎన్నడు?

కవర్ స్టోరీ..6

మహిళా వికాసమే ప్రగతికి సోపానం

ఈ వారం కవిత్వం.. 11

లీలా విలాసం

మానవాళికి దివ్య.. 13

ప్రపంచాన్ని కలిపే.. 14

కథ..18

వీలునామా

స్మార్ట్ ఫోన్ చేతిలో.. 21

ఇంకా...

ముగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..

## మంచి ముత్యాలు

– పుస్తక పఠనం ఆలోచనలకు తగ్గట్టుగా, ఆలోచనలు పుస్తక పఠనానికి తగ్గట్లుగా ఉండాలి. – ఎమ్మెర్సన్

– ప్రతిభ అనేది ఒక్క శాతం ప్రేరణ, తొంభై తొమ్మిది శాతం అవిరళ కృషి.

# సమాచారం

## 'ఓమ్' ఆకారంలో శివాలయం



రాజస్థాన్‌లోని పాలి జిల్లా, జాడన్ గ్రామం సమీపంలో ఉందీ ఆలయం. పై నుంచి చూస్తే 'ఓం' ఆకారంలో కనిపించడం దీని ప్రధాన ప్రత్యేకత. ఆలయాన్ని 'ఓం' ఆకారంలో రూపొందించారు. ఈ దేవాలయంలో ప్రధానంగా శివుడిని ఆరాధిస్తారు. ఆలయ నిర్మాణంలో హిందూ వాస్తు, ఆధ్యాత్మిక భావనలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆలయాన్ని పై నుంచి చూస్తే 'ఓం' గుర్తు స్పష్టంగా కనిపించేలా నిర్మాణాన్ని రూపొందించారు. ఈ ప్రత్యేక ఆకారం కారణంగా ఇది రాజస్థాన్‌లోని ఆసక్తికరమైన ఆధ్యాత్మిక నిర్మాణాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిందీ దేవాలయం. సాధారణంగా ఆలయాలు గోపురాలు, శిఖరాలు లేదా మండపాల నిర్మాణంతో ప్రత్యేకతను పొందుతాయి. కానీ జాడన్‌లోని ఈ ఆలయం మొత్తం ఆలయ ప్రణాళికనే 'ఓం' ఆకారంలో రూపొందించడం వల్ల మరింత ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఈ ఆలయం ప్రత్యేకమైన నిర్మాణ శైలికి ప్రసిద్ధి చెందింది. దీనిని సాధారణంగా 'ఓం ఆశ్రమం'గా కూడా పిలుస్తారు.

**ఈ గుడి ప్రత్యేకతలు: ఓం ఆకారం:** ఆలయ సముదాయం మొత్తం పై నుంచి చూసినప్పుడు 'ఓం' ఆకారాన్ని పోలి ఉండేలా నిర్మించారు. **భారీ నిర్మాణం:** ఇది విస్తారమైన ప్రాంగణంలో నిర్మించబడిన పెద్ద ఆధ్యాత్మిక సముదాయం. **108 అడుగుల శివ విగ్రహం:** ఆలయ సముదాయంలో భారీ శివ విగ్రహం ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలుస్తుంది.

**ఆధ్యాత్మిక కేంద్రం:** ధ్యానం, యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అనుకూలంగా ఆశ్రమాన్ని రూపొందించారు. **ప్రతీకాత్మక నిర్మాణం:** 'ఓం' హిందూ సంప్రదాయంలో పవిత్రమైన ధ్వనిగా భావిస్తారు. ఆ ప్రతీకను ఆలయ నిర్మాణంలోనే ప్రతిబింబించడం దీని ప్రత్యేకత. ఈ ఆలయానికి ఉన్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే భూమిపై నిలబడి చూస్తే సాధారణ ఆలయంలా కనిపించినా, పై నుంచి లేదా వైమానిక దృశ్యంలో దాని 'ఓం' ఆకారం స్పష్టంగా తెలుస్తుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# నవ్వుల్... రువ్వుల్...

## ఎక్కువ శక్తి

బంటి: మనుషుల కంటే ఎలుకలకే ఎక్కువ శక్తి ఉంటుంది.

టీచర్: అదెలా?

బంటి: మనిషి కూడా మొయ్యలేని వినాయకుణ్ణి ఎలుక మోస్తుంది కదా..!

## స్నేహంగా..

విద్యార్థి తండ్రి: ఏం కాలేజ్ ఇది? లెక్చరర్స్ ఇలానా చేసేది?

ప్రిన్సిపాల్: ఏమయ్యింది? లెక్చరర్స్ స్టూడెంట్స్‌తో స్నేహంగా ఉండేలా చేస్తాము.

విద్యార్థి తండ్రి: అందుకే ఒక లెక్చరర్ స్నేహంగా ఉంటూ మా వాడి దగ్గర డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వట్లేదు..

## ఫ్రీ...ఫ్రీ..!

ఓనర్: మొబైల్ కొంటే పవర్ బ్యాంక్ ఫ్రీ.. అన్నాడు.

కస్టమర్: పవర్ బ్యాంక్ కాస్ట్ ఎంత?

ఓనర్: రెండు వేలు.

కస్టమర్: పవర్ బ్యాంక్ వద్దు.. రెండు వేలు తీసేసి మిగతావి మొబైల్‌కి ఇస్తాను..

**-ఎస్.కె.యాకూబ్ పాషా,** ఖమ్మం.

## దేవుడు ప్రత్యక్షమైతే?

టీచర్: "దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమంటే ఏమి కోరుకుంటావు?"

రవి: "మా తెలుగు టీచర్‌ని మార్చమని కోరుకుంటాను".

టీచర్: ఓర్నీ..!

## ఆలస్యం

బాస్: "నిన్న ఆఫీసుకు రాలేదు, ఏమైంది?"

గుమాస్తా: "లేటయితే ఆఫీసుకు రావద్దని మీరే కదా చెప్పారు"

బాస్: "సరే... ఇంతకూ లేట్ ఎందుకైంది?"

గుమాస్తా: "మా ఆవిడకు ఆమ్లెట్ వేసిచ్చేసరికి లేటయింది" అన్నాడు.

## వైఫ్ వేర్

విశ్వనాథం: "మీ అబ్బాయిలు ఏం చేస్తున్నారు?"

స్వామినాథం: "పెద్దవాడు సాఫ్ట్‌వేర్, చిన్నవాడు వైఫ్‌వేర్"

విశ్వనాథం: "వైఫ్‌వేర్ అంటే?"

స్వామినాథం: భార్య తెస్తే కూర్చొని తినడం.




## అతిథులు వచ్చారని..

మొదటి యాచకుడు: "ఇవాళ రంగన్న ఇంకా రాలేదేమిటి?" అడిగాడు రెండవ యాచకునితో.

రెండవ యాచకుడు: "వాడింటికి గెస్టులు వచ్చారట. నాలుగు వీధులు ఎక్కువ తిరగాలని పొద్దున్నే వచ్చి వెళ్లిపోయాడు".




## అమ్మగారితో గొడవ..

ఆఫీస్‌బాయ్: "ఏమైంది సార్! ముఖం అలా వుంది?"

క్లర్క్: "అయ్యగారిని లీవ్ అడగడానికి వెళ్తే కోప్పడ్డాడు"

ఆఫీస్‌బాయ్: "బాస్ దగ్గరికి వెళ్లేముందు నన్ను ఒక మాట అడగవలసింది. రాత్రి అయ్యగారికి, అమ్మగారికి పెద్ద గొడవయింది".

## ముగ్గు తొక్కకుండా!

"ఏరా వీర్రాజూ, ఇంత చలిలో బయట నిలబడ్డావు?"

"నేనేమయినా ఊరికనే నిలబడ్డానా? మా ఆవిడ వేసిన ముగ్గు ఎవరూ తొక్కకుండా కాపలా కాస్తున్నాను" జవాబిచ్చాడు.

## వాళ్లావిడ

"సార్, పక్కింటి స్వామి నన్ను చంపేస్తానని బెదిరించాడు" చెప్పాడు ఎస్.ఐ.తో"

"దానికి సాక్ష్యం ఉన్నారా ఎవరైనా?"

"వాళ్లావిడే సాక్ష్యం సార్"

"అప్పుడు వాళ్లావిడ ఎక్కడుంది"

"ఆ సమయంలో వాళ్లావిడ నా కౌగిలిలో ఉంది"

"ఆ..!" అంటూ ఎస్ఐ పడిపోయాడు.

## బ్యాటరీ ఫుల్

వనజ: రాత్రి మీ ఇంట్లో నుండి గట్టిగా కేకలు వినిపించాయి.. ఏమైంది?

సరోజ: నా సెల్‌లో చార్జింగ్ పూర్తయిన తరువాత బ్యాటరీ ఫుల్ అని వచ్చింది. అది చూసి మా ఆయన నీ సెల్‌లో బ్యూటిఫుల్ అని వచ్చిందని నా మీద కేకలేసారు.

వనజ: మరి నువ్వేం చేసావు?

సరోజ: నేను ఊరుకుంటానా ఏంటి? నేనూ అదే రేంజ్‌లో మాట్లాడాను.

**- వైదా.ఈ.రావు,** మింది

**సరదా రచనలకు ఆహ్వానం**

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**

**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్... రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**

***sunmagvaartha@gmail.com***

'సంఘీ' భావం



# కబ్జాలకు ముగింపు ఎన్నడు?

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ భూముల కబ్జాకు పగ్గాలు లేకుండా ఉన్నాయి. అధికారంలో ఉన్న పార్టీలకు చెందిన కొందరు బడాబాబులు చట్టాలను తోసిపుచ్చి వందలాది ఎకరాల ప్రభుత్వ, నిషేధిత భూములను స్వంతం చేసుకుంటున్నారు. భూముల విలువలు గణనీయంగా పెరుగుతున్న తరుణంలో అవినీతికి పాల్పడే నాయకులు, అధికారులు భూములపై కన్నేసి తమపరం చేసుకుంటున్నారు. దీనికి కింది స్థాయి నుంచి అత్యున్నత స్థాయి అధికారి, ప్రజా ప్రతినిధుల వరకు అండదండలు లభిస్తున్నాయి. కొందరు రియల్టర్లు ఏకంగా ప్రజాప్రతినిధులుగా ఉండటంతో వారికి ఎదురు లేకుండా పోతోంది.ప్రస్తుతం తెలంగాణలో భూముల కబ్జా వ్యవహారం తీవ్రస్థాయిలో చర్చకు దారితీసింది. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతల భూ భాగో తాన్ని వెల్లడించారు. దీనిపై హైలెవల్ కమిటీని కూడా నియమించారు. అయితే ప్రభుత్వ, నిషేధిత భూముల కబ్జాలు రెండు రాష్ట్రాల్లో కొత్తేమీ కాదు. ఎవరి స్థాయిలో వారు భూములను చెరపెడుతూనే ఉన్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ అధికారుల అండదండలు, ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో భూములు కబ్జాలు జరుగుతూనే ఉన్నాయి. చివరకు అటవీ భూములు, చెరువు శిఖం భూము లను సైతం ఆక్రమించి రియల్ ఎస్టేట్‌కు వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లో హైడ్రా చెరువు శిఖం భూములు. ప్రభుత్వ భూములపై దృష్టి సారించి వాటిని స్వాధీనం చేసుకోవడంలో కొంత కఠినంగానే వ్యవహరిస్తోంది. అయితే ఎన్నో అడ్డంకులను, న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవలసి వస్తోంది. భూములను పరిరక్షించేందుకు ఎన్నో చట్టాలు ఉన్నాయి. ఉదా: తెలంగాణలోనే సుమారు 20వరకు చట్టాలు అమలులో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి తెలంగాణ భూ హక్కుల రికార్డుల చట్టం, 2020 ఇందులో భూమి రికార్డులు, హక్కులు నమోదు చేసి ఉంటాయి.

తెలంగాణ పట్టాదార్ పాస్‌బుక్ చట్టంలో పట్టాదార్ పాస్‌బుక్, భూ హక్కుల వివరాలు ఉంటాయి.అదేవిధంగా తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ చట్టాలు (భూమి శిస్తు, రెవెన్యూ వ్యవహారాలు), తెలంగాణ అసైన్‌డ్ ల్యాండ్స్ (ట్రాన్స్ ఫర్ నిషేధం) చట్టం, 1977 (ప్రభుత్వం కేటాయించిన భూముల విక్రయాలు/ బదలాయిం పులపై పరిమితులు), తెలంగాణ భూ ఆక్రమణ నిరోధక చట్టాలు – (ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించిన నిబంధనలు). తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్టాలు (పట్టణ ప్రాంతాల్లో భూమి అభివృద్ధి, లేఅవుట్లు మొదలైనవి), తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్‌కు సంబంధించిన నిబంధనలు.

రిజిస్ట్రేషన్ చట్టం, 1908 (భూమి అమ్మకం, కొనుగోలు, గిఫ్ట్, మార్టేజ్ తదితర పత్రాల రిజిస్ట్రేషన్‌లు) ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్,1882 (ఆస్తి బదలాయింపులకు సంబంధించిన ప్రధాన కేంద్ర చట్టం), ఇండియన్ స్టాంప్ యాక్ట్/తెలంగాణ (స్టాంప్ చట్ట నిబంధనలు – స్టాంప్ డ్యూటీ), భూ సేకరణ, పునరావాసం, పునరావాస హక్కుల చట్టం, 2013(ప్రభుత్వం భూమిని సేకరించే సమయంలో అమలు చేస్తారు).

టెనెన్సీ/కౌలు భూములకు సంబంధించిన చట్టాలు (వ్యవ సాయ భూముల కౌలు, సాగుదారుల హక్కులు వంటి అంశాలు), ఫారెస్ట్ చట్టాలు (అటవీ భూములు, పోడు/అటవీ హక్కులు), ల్యాండ్ సీలింగ్ చట్టాలు (వ్యక్తి/కుటుంబం కలిగి ఉండగల వ్యవసాయ భూమి పరిమితులకు సంబంధించినవి), ఎన్‌కంబరెన్స్,వారసత్వం, కోర్టు వివాదాలు వంటి అంశాలకు సంబంధించిన ఇతర చట్టాలు కూడా అమలులో ఉన్నాయి. ఇవి కాకుండా చెరువులను కాపాడటానికి కొన్ని చట్టాలున్నాయి. నీరు ప్రవహించే మార్గంలో అడ్డంకులుగా ఉండే విధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. చెరువు శిఖం భూమిని ఆక్రమించడం లేదా అక్రమంగా వినియోగించడం సమస్య కావచ్చు. పట్టా భూమి అని రికార్డులో ఉన్నప్పటికీ, అది ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉందా లేదా అనేది ముఖ్యమైన అంశం.

ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్, చెరువు కట్ట, నాలా వంటి వాటికి వేర్వేరు నిబంధనలు ఉండవచ్చు. ఎఫ్‌టిఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్లు, ఇతర నిర్మాణాలు చేయడంపై పరిమితులు ఉంటాయి. భూమి కొనుగోలు చేసే ముందు, నిర్మాణాలు చేపట్టే సమయంలో ధరణి, భూభారతి రికార్డులు, సర్వే నంబర్, ఎఫ్‌టిఎల్ మ్యాప్, రెవెన్యూ రికార్డులు, నీటిపారుదల శాఖ రికార్డులు పరిశీలించడం ఎంతో ముఖ్యమైన అంశం. ఇక కొన్ని వివాదాస్పద భూములకు సంబంధించి 22ఎ నిషేధిత చట్టం ఉంది. ప్రస్తుతం ఇదే తెలంగాణాలో హల్‌చల్ చేస్తోంది. సాధారణంగా 22ఏ జాబితాలోకి ప్రభుత్వ భూములు అసైన్డ్ భూములు బదలాయింపుపై నిషేధం ఉన్నవి, ఎండోమెంట్/వక్ఫ్ వంటి సంస్థలకు చెందిన భూములు కోర్టు వివాదం లేదా ప్రభుత్వ ఆదేశాల వల్ల రిజిస్ట్రేషన్ నిలిపిన ఆస్తులు చట్టం/ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం బదలాయింపు నిషేధితమైన ఇతర భూములు ఈ చట్టం కిందకు వస్తాయి.ఎన్ని చట్టాలు ఉన్నా కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు కలిపినప్పుడు అవన్నీ పక్కన పెట్టి వందల ఎకరాల కబ్జాకు తెర లేపుతు న్నారు. దీనిపై మరింత కఠినంగా వ్యవహరిస్తేనే ప్రభుత్వం, నిషేధిత భూములకు రక్షణ కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



**కవర్ స్టోరీ**

**డాక్టర్ కె.ఉమాదేవి**

# మహిళా వికాసమే ప్రగతికి సోపానం

నేడు భారతదేశంలో ప్రతి ఐదుగురు ఆడపిల్లల్లో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీనివల్ల ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా బలహీనంగా ఉన్నారని చెప్పొచ్చు. ముఖ్యంగా 15-50 సంవత్సరాల వయస్సు గల స్త్రీలు అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు.

స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే వారి ఇంట సుఖశాంతులు విరజిల్లుతాయి. ఎంత సంపద ఉన్నా స్త్రీ ఆరోగ్యంగా లేకపోతే ఆ ఇల్లు కళావిహీనమైపోతుందనే చెప్పాలి. యుక్త వయస్సుల్లో చదువుల ఒత్తిడి, బహిష్టులోపాల వల్ల రోగ నిరోధకశక్తి తగ్గి పోషకాహార సమస్యలు తలెత్తుతున్నాయి. పెళ్లయిన తర్వాత గృహ నిర్వహణ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిళ్లు, భార్యాభర్తల మధ్య సరైన అవగాహన లేకపోవడం వల్ల సరైన పోషణ లభించక రక్తహీనత సమస్యలతో సతమతమవుతున్నారు.

గర్భధారణ సమయంలో తల్లుల్ని సరైన పద్ధతిలో ఎలా సంరక్షించుకోవాలో, పిల్లలకి ఏమి, ఎప్పుడు తినిపించాలో అనే విషయాలపై సరైన అవగాహన లేక చాలామంది బాధపడుతుంటారు. 75 శాతం మంది స్త్రీలు పోషణ లోపాలతో అనారోగ్యంపాలవుతున్నారు. దాంతో పిల్లల ఆరోగ్యం, చదువు, సంరక్షణ కుంటుపడుతుంది.

ప్రతి కుటుంబం స్త్రీ ఆరోగ్యానికి అండగా నిల్చితేనే ఇంట్లో పోషకాహారానికి గౌరవం, ప్రాధాన్యత నిల్చినట్లే. స్త్రీలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం బలపడుతుంది. సమాజం ఆరోగ్యంగా ఉంటే దేశం అభివృద్ధి దిశగా మరింత బలంగా అడుగులు వేస్తుందనేదే రాష్ట్రీయ పోషణ ముఖ్య ఉద్దేశం. అందుకే భారతదేశంలో ప్రతి సంవతనసరం సెప్టెంబరు నెలని దేశవ్యాప్తంగా రాష్ట్రీయ పోషణ నెల లేదా జాతీయ పోషకాహార మాసంగా జరుపుతున్నారు. పోషకాహార లోపాల్ని పిల్లలు, గర్భిణీల్లో, స్త్రీలలో ఏ విధంగా ఎదుర్కోవాలో, దీనికి ఎలాంటి ఆహారం తీసుకోవాలనేదానిపై సరైన అవగాహన కల్గి ఉండాలి. పోషకాహారాన్ని ఒక సామూహిక ఉద్యమంగా మార్చగలగాలి.

ముఖ్యంగా స్త్రీలు, పిల్లల్లో రక్తహీనత నివారణకి, పిల్లల ఎదుగుదలకి ఉపయోగపడే ఆహారంపై అవగాహన కలిగించి, ఆహారం చక్కెర, నూనె వాడకాన్ని తగ్గించి, చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించి, సరైన విద్యతో పాటు మంచి ఆహారాన్ని సమపాళ్లలో ఏ విధంగా కుటుంబ అవసరాల్ని బట్టి అందివ్వగలగాలి.. అనేదానిపై స్త్రీలకు కుటుంబ పెద్దగా వారి అవసరాలకనుగుణంగా ఇవ్వగలరనే మంచి ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. వీటిని పారదర్శకంగా పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం 'పోషన్ ట్రాకర్' మొబైల్ అప్లికేషన్‌ని, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ని పోషన్ అభియాన్ పోర్టల్ ద్వారా వివరాల్ని పొందుపర్చడమైంది.

2018లో మార్చి 8న నరేంద్రమోడీ రాజస్థాన్‌లోని ఝుంఝునులో పోషన్ అభియాన్ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రజల్లో మరింత అవగాహన పెంచడానికి, ఒక 'జన ఆందోళన్' (ప్రజా ఉద్యమం) లాగా మార్చడానికి సెప్టెంబరు నెలని పోషణ్ నెలగా ప్రకటించడమైంది.

వీటిలో మొదటి 1000 రోజుల్లో బిడ్డ పరిస్థితి, తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి-బిడ్డ ఆరోగ్య సంరక్షణ, రక్తహీనత నిర్మూలన, ఆరోగ్యకరమైన ఆహారం వ్యక్తిగత పరిశుభ్రత, శానిటేషన్ పద్ధతులు, విరేచనాల నియంత్రణ అనే ఐదు అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తారు. దీనికిగాను గర్భిణీలకి పౌష్టికాహారం ప్రాధాన్యతని వివరిస్తూ సీమంతాలు చేయడం, ఆరు నెలలు నిండిన చిన్నారులకి ఘనాహారం అలవాటు చేసేలా అన్నప్రాసన ఈవెంట్స్ చేయడం, కిచెన్ గార్డెన్‌ల్ని ఏర్పాటు చేయడం చేయాల్సి ఉంటుంది. దీనివల్ల భవిష్యత్‌లో రోగాలు దరిచేరవన్న ఉద్దేశంతో ఐసీడీఎస్ అధికారులు చురుకుగా పాల్గొనడమైంది.

దేశంలో పోషకాహార లోపం సవాళ్లని ఎదుర్కోవడానికి మంచి పోషకాహారం, ఆరోగ్యకరమైన పద్ధతుల్ని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ సమీకృత పోషకాహార సహాయ కార్యక్రమాన్ని పోషకాహార లోపం నుండి రోగ నిరోధక శక్తిని పెంపొందించే పద్ధతులపై దృష్టి కేంద్రీకృతమై ఉంది. పర్యావరణ సుస్థిరతను పోషకాహార అవగాహనతో అనుసంధానించడమే దీని లక్ష్యం. పోషణపై అవగాహన, సంరక్షణ పాత్రలలో పురుషుల్ని చురుకుగా పాల్గొనేలా చేయడానికి ప్రయత్నించాలి. పురుషుల స్ట్రీమింగ్ ఆవశ్యకతని చాటిచెప్పడం ఆరోగ్య పోషణలో సమానత్వం, సాధికారతని కలుపుకోవడంతో, పోషకాహారం పట్ల ఒక సంపూర్ణ దృక్పథాన్ని....

ప్రతిబింబిస్తాయి. దీనికిగాను పాఠశాలల్ని పోషకాహార స్పృహ కలిగిన వాతావరణాలుగా మార్చడం, తద్వారా విద్యార్థులు, సిబ్బంది, కుటుంబాలు సమిష్టిగా ఆరోగ్యకరమైన ఆహార పద్ధతుల్ని పాటించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

"ఆరోగ్యకరంగా తినండి, సురక్షితంగా తినండి, సుస్థిరంగా తినండి" వంటి కీలక సందేశాలు వీటిలో పొందుపర్చబడ్డాయి. వీటిలో పాఠశాల నిర్వహణ కమిటీల(ఎస్ఎమ్‌సి) కోసం 'హెల్తీ డైరీ' డిజిటల్ వాల్ పెయింటింగ్‌లు, న్యూట్రిషన్ గార్డెన్ పుస్తకాలు, సన్‌బోర్డుల వంటి సృజనాత్మక, ఆకర్షణీయమైన వనరుల అభివృద్ధి ఉన్నాయి.

ఆరోగ్యాన్ని కొనలేం కానీ ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని కొనుక్కోవచ్చు. ప్రకృతిసిద్ధంగా సీజనల్ వారీగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మొలకెత్తిన విత్తనాలు, తృణధాన్యాల్ని తీసుకోవాల్సి ఉంటుంది. వీటికి ఉప్పు, కారం, నూనె, మసాలాలు తగ్గించి తీసుకోవాల్సి ఉంటుంది. రోజూ 4-5 లీటర్ల నీరు కొద్దికొద్దిగా తీసుకోవాల్సి ఉంటుంది. తిన్న ఆహారానికి అనుగుణంగా సరైన వ్యాయామం, నడక, యోగా, ఈత, జాగింగ్, ధ్యానం చేయాలి. ఇష్టమొచ్చిన రుచులకి కళ్లెం వేయాలి. రోగాల్ని మనల్ని పట్టుకోలేదు. సరైన పోషణపై అవగాహన లేక మనమే రోగాల్ని పట్టుకున్నాం.

కాబట్టి స్త్రీలు పోషణకి అవసరమయ్యే ఆహారం గురించి అవగాహన పెంచుకోవాలి. సరైన పోషణతో ఆహారాన్ని సమపాళ్లలో తీసుకుంటే ఆరోగ్యాన్ని ఎలా పెంపొందించుకోవచ్చు.. అనే విషయం తెలుసుకోవచ్చు. దీనివల్ల రోగాలు తగ్గే శిక్షణ, రోగాలు రాకుండా రక్షణ పై విధంగా పోషకాహారం ద్వారా నివృత్తి చేసుకోవాలి.. అని అందరూ తెలుసుకోవడం ముఖ్యం.

ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెరుగుతాయి. పిల్లల ఆరోగ్యం పదుతుంది. తద్వారా కుటుంబ వైద్య ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే మహిల ఆరోగ్యంపై పెట్టే శ్రద్ధ, కుటుంబ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి లాంటిదని చెప్పవచ్చు. మహిళ ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలుండేలా చూసుకోవాలి.

కుటుంబంలో అందరి ఆహారం గురించి శ్రద్ధ తీసుకునే మహిళలు తాను ఏమి తింటున్నాననే విషయాన్ని చాలా సార్లు పట్టించుకోదు. పనుల ఒత్తిడిలో, ఆర్థిక సమస్యలు, సామాజిక కట్టుబాట్లు, బాధ్యతలతో ఎటువంటి ఆహారాన్ని, ఏ విధంగా తీసుకోవాలనే విషయంలో సందిగ్ధావస్థలో పడి అనారోగ్యాల బారిన పడుతున్నారు. 'పోషణ్ భీ పడాయి భీ' కింద దేశవ్యాప్తంగా పోషణ్, పోషణ్ పఖ్వాడాలు 100 కోట్ల ఖర్చుతో



కేంద్రీకృత చైతన్య కార్యక్రమాలు జరిగినట్లు నివేదించబడ్డాయి.

'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మొక్కల పెంపకం కార్యక్రమం పర్యావరణ సుస్థిరతకి, పోషకాహారానికి మధ్య ఉన్న సంబంధానికి ప్రతీక అని చెప్పవచ్చు. దేశ్యాప్త కార్యకలాపాలు రాష్ట్రాల సమిష్టి కృషిని ప్రతిబింబిస్తున్నాయి. వీటిలో వరుసగా మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లు ముందంజలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంక్ పోషణ్ అభియాన్‌కు మద్దతు ఇవ్వడం విశేషం.

పోషణ్ అభియాన్ అనేది భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం. దీని ద్వారా ప్రతి సంవత్సరం పోషకాహార లోపాన్ని 2 శాతం తగ్గించడమే దీని ఉద్దేశం. దీంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ముంబైలో (3.9.2024) పోషణ్ ట్రాకర్ కార్యక్రమానికిగాను ఈ గవర్నెన్స్ రంగంలో జాతీయ అవార్డుని అందుకుంది. ఇది భారతదేశాన్ని మరింత ఆరోగ్యవంతంగా మార్చే ఒక జాతీయ ప్రయత్నం. మంచి పోషణ, మంచి ఆహారం జీవితంలోని ప్రతి దశని ఎలా మెరుగుపరుస్తుందో వివరించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఇది పిల్లలకు వారి ఎదుగుదలకి, నేర్చుకోవడానికి సహాయపడితే, పెద్దలకి బలాన్ని, ఉత్పాదకతని అందిస్తుంది. వృద్ధులకి ఇది మెరుగైన రోగ నిరోధక శకినతని, శక్తిని, ప్రతి తరానికి ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి ప్రాముఖ్యతని నొక్కి చెబుతుంది.

చిన్న చిన్న రోజువారీ అలవాట్లు (స్థానిక ఆహారం తినడం, జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉండడం, శుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవడం, చేతులు కడుక్కోవడం) కుటుంబాల్ని పోషకాహార లోపం నుండి కాపాడగలవని, ప్రతి ఇంట్లో ఆరోగ్యకరమైన జీవనాన్ని ఒక సాధారణ అలవాటుగా మనల్ని ఏ విధంగా మార్చగలవో తెలుస్తుంది. దీనివల్ల దృఢమైన శరీరాలు, ప్రకాశంతమైన మనస్సులు కలిగి ఏ విధంగా అన్ని రంగాల్లో స్త్రీలు మెరుగ్గా రాణించగలరో తెలుస్తుంది.

ఆరోగ్యకరమైన కుటుంబం ఆరోగ్యకరమైన మహిళతోనే మొదలవుతుంది. కాబట్టి తల్లులు ప్రతి ఇంటికి వెన్నెముక వంటివారు.

పోషకాహార పరిజ్ఞానంతో మహిళల్ని శక్తివంతం చేయడం కేవలం ఈ రోజుకు సంబంధించింది మాత్రమే కాదని, అది రేపటి కుటుంబాల శ్రేయస్సుని సురక్షితం చేస్తుందని 'పోషణ మాహ్' మనకు గుర్తుచేస్తుంది. ఆహారం కేవలం కడుపు నింపుకోవడానికి మాత్రమే కాదు. అది శరీరానికి, మనసుకు బలాన్ని, ఆనందాన్ని, శక్తినిచ్చి వ్యాధి నివారణలో ఉపయోగపడుతుంది.

పోషకాహార లోపం భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా మిగిలిపోయింది. ఇది బలహీనమైన రోగనిరోధక శక్తికి, ఎదుగుదల లోపానికి, తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు దారి తీస్తుంది. పోషకాహార లోపంపై పోరాటానికి కుటుంబాలు, సమాజాలు, సంస్థలు, ప్రభుత్వం.. ఇలా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయడం అవసరం.దీనివల్ల ప్రతి బిడ్డ ఆరోగ్యంగా, బలంగా ఎదిగే అవకాశం లభిస్తుంది. మనం రేపటికోసం మరింత బలమైన, తెలివైన, ఆరోగ్యకరమైన పౌరుల్ని

తయారుచేస్తాం.

పోషకాహారం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి బాధ్యతగా మార్చగలిగితే ఈ కార్యక్రమం నెరవేరినట్లే. అలాగే గర్భిణిలకు 'గోద్ భరై' (సీమంతం), చిన్నపిల్లలకు 'అన్నప్రాసన' వంటి సాంప్రదాయ వేడుకల ద్వారా, న్యూట్రి గార్డెన్స్ ద్వారా పోషణ్ 2.0గా చేసి బలోపేతం చేస్తున్నారు.

ఈ సంవత్సరం 9వ జాతీయ పోషకాహార మాసాన్ని సెప్టెంబరు 17 నుండి అక్టోబరు 16 వరకు జరుపుకుంటున్నారు. గత సంవత్సరం పోషణ మాసాన్ని 'స్వస్థ నారి, స్వశక్త్ పరివార్' అనే ఇతివృత్తంతో జరుపుకున్నారు. ఈ సంవత్సరం 2026లో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ సందర్భంగా చక్కెర, నూనె వాడకం తగ్గించి స్థూలకాయాన్ని బాల్య సంరక్షణ విద్య ద్వారా ఇన్ఫాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్(ఐవైసిఎఫ్) పద్ధతులు మీద దృష్టి పెట్టడమైంది.

- గర్భిణిలకు మంచి ఆహారం-రేపటి తరానికి బంగారు పునాది.

- సహజ ఆహారమే మన సంజీవని.. జంక్‌ఫుడ్‌కు చెబుదాం బై బై!

- మహిళల ఆరోగ్యం-ఇంటికి భాగ్యం

- కూరగాయలు, ఆకుకూరలు నిత్యం తిందాం-సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుదాం.

- పోషకాహారం తిందాం-రోగాల్ని తరిమికొడదాం.

- స్క్రీన్ టైమ్ తగ్గిద్దాం-పిల్లల ఆటపాటల్ని పెంచుదాం!

- ఇంటి వంటకమే ఆరోగ్యం-ఫాస్ట్‌ఫుడ్ తెస్తుంది అనారోగ్యం.

- తల్లిపాలు శిశువుకు అమృతం-వ్యాధి నిరోధక శక్తికి అదే అద్భుతం.

- సమతులాహారం తల్లీబిడ్డకు వరం. ఆరోగ్యకరమైన సమాజానికి అదే ఆధారం!

- రక్తహీనతని తరిమికొడదాం-ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం!

వంటి జీవన శైలి మార్పులపై గర్భిణులు, శిశువుల పోషణపై పై స్లోగన్లతో ఆరోగ్యశాఖ ముందుకు రావడం ముదావహం.

తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రభుత్వం అందించే బాలామృతం ప్లస్ వంటి పౌష్టికాహారాన్ని రోజుకు 100 గ్రాముల చొప్పున క్రమబద్ధంగా తినిపించాలి. 6 నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు ఇంట్లో తయారు చేసిన మెత్తటి ఆహారాన్ని అనుబంధ ఆహారంగా అలవాటు చేయాలి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) వారి మార్గదర్శకాల ప్రకారం ఈ కింది జాగ్రత్తలు పాటించాలి.

- నిల్వ ఉంచిన ఆహారాలు, పాడైపోయిన, రంగు మారిన, పాసిపోయిన ఆహార పదార్థాల్ని



తినకూడదు.

- పచ్చికూరగాయలు, మాంసం, వండి ఆహార పదార్థాల్ని విడివిడిగా భద్రపరచడం వల్ల క్రాస్‌కొంటామినేషన్‌ని నివారించాలి.

- ఫ్రిజ్‌లో పెట్టిన వండిన ఆహారాన్ని తినేముందు బాగా వేడిచేయాలి. కానీ ఒకే ఆహారాన్ని పదే పదే వేడి చేయకూడదు.

- వంట చేసే పాత్రలు, ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. భోజనానికి ముందు, పిల్లలకు తినిపించే ముందు చేతుల్ని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

- ఖరీదైన పండ్ల కన్నా స్థానికంగా లభించే జామకాయలు, బొప్పాయి, ఉసిరి, తోటకూర, క్యారెట్ వంటి తక్కువ ఖర్చుతో కూడిన పోషక ఆహారాన్ని ఎంచుకోవాలి.

- రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

జీవితంలో మొదటి ఆరేళ్ల వయస్సులో పిల్లల్లో కలిగే మేథోవికాసం కాబట్టి 'పండంటి ఆరోగ్యం'తో ఉన్న పాపాయే బలమైన దేశానికి పునాది 'పోషణ్ అభియాన్' కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు. ప్రజలు నడిపే ఉద్యమం ఇది. ప్రతి తల్లికీ, ప్రతి బిడ్డకీ సంపూర్ణ పోషణ అందేటట్లు చూడడం ఈ ఉద్యమం లక్ష్యం. పిల్లల్లో సమగ్ర వికాసంతో పాటు బడికి వెళ్లడానికి సన్నద్ధం కావడంలో తోడ్పాటును అందించడం. బాధ్యతతో కూడిన సంరక్షణతో పాటు ప్రారంభ దశలోనే బిడ్డ విషయాల్ని నేర్చుకొనేటట్లుగా మాటా మంతీని ప్రోత్సహించడం, ఆరోగ్యదాయక అలవాట్లనీ, చురుకైన భాగస్వామ్యాన్నీ ప్రోత్సహించడం చేయడం జరుగుతుంది.

సరైన స్త్రీ ఆహార పోషణ వల్ల కౌమార బాలికలు, స్త్రీలలో అధిక స్థాయిలో ఉన్న రక్తహీనత, ఎముకల బలహీనత, అలసట, నిస్సత్తువ వంటి సమస్యలు తగ్గుతాయి.

మంచి ఆహారం గర్భిణిలు ఆరోగ్యకరమైన పిండం పెరుగుదలకోసం, సరైన బరువు పెరగడానికి, గర్భిణిల్లోని హై రిస్క్ సమస్యల్ని, గర్భస్థ పిండలోపాల్ని తగ్గించడానికి, ఐరన్, ఫోలిక్ ఆసిడ్, కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవడానికి సహాయపడుతుంది.

ఇది శిశువుల్లో తక్కువ బరువుతో పుట్టడాన్ని నివారిస్తుంది. అంతేగాకుండా మాత, శిశు మరణాల్ని తగ్గిస్తుంది. పాలిచ్చే తల్లులు నవజాత శిశువులకి పోషకాలు అధికంగా ఉండే తల్లిపాలని ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. తద్వారా తల్లిని, పెరుగుతున్న బిడ్డని పోషకాహార లోపాల నుండి కాపాడుతుంది. దీనివల్ల యుక్తవయస్సు, మాతృత్వానికి ముందు బలమైన శరీరాల్ని నిర్మించుకుంటారు. కాబట్టి మంచి పోషణ ఉన్న మహిళలు మెరుగైన ఆరోగ్య నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఇంటిల్లిపాదీ సరైన ఆరోగ్య అలవాట్లతో, పోషణతో, ఎదుగుదలతో ముందుకు సాగుతారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ■

# దేవుడు పంపించాడా..?

ఆ గ్రామంలోకి ఒక కొత్త మనిషి వచ్చాడు.

అతనిని చూడటంతోనే గ్రామస్థులు "నువ్వు ఎక్కడి నుండి వస్తున్నావు?" అని అడిగారు.

"నేను స్వర్గం నుండి వచ్చాను" అని అతను అన్నాడు.

అతని మాటలు విన్నవారు పగలబడి నవ్వారు. "నిన్ను ఇక్కడికి ఎవరు పంపారు?"

"దేవుడు నన్ను పంపించాడు"

ఈ మాటతో వారు ఒకరిని చూసి మరొకరు మరింత పెద్దగా నవ్వారు.

అతను తప్పకుండా పిచ్చివాడేనని భావించి, అతన్ని తమ ఊళ్ళోని ఓ ప్రదేశానికి తీసుకెళ్లారు.

అది మానసిక రోగులను నయం చేసే ఆలయం. అక్కడ హాలులో ఉన్న ఒక రాతి స్తంభానికి అతన్ని కట్టేశారు.

ఇప్పుడు వారిని చూసి నవ్వడం అతని వంతైంది.

"నువ్వు ఎందుకు నవ్వుతున్నావు?"

"దేవుడు నన్ను పంపినప్పుడు, ప్రతిదీ ఇలాగే జరుగుతుందని చెప్పాడు!"

"ప్రతిదీ ఎలా జరుగుతుంది?"

"దేవుడు నిన్ను కట్టివేస్తారు అని కచ్చితంగా చెప్పాడు... ఇది ఆయన చెప్పినట్లే జరిగింది కాబట్టి నాకు మీ తీరుని చూసి నవ్వొచ్చింది. నేను ఆయన దూతను అనడానికి మీకు ఇంతకన్నా ఇంకేం రుజువు కావాలి?"

ప్రజలు ఇప్పుడు ఆలోచనలో పడ్డారు. వాళ్లలో వాళ్లు గుసగుసలాడారు.

"సరే కానీ. నువ్విప్పుడు మాకు ఏం చెప్పాలనుకుంటున్నావు?"

"అలాగా....చెప్తాను....వినండి....

నన్ను నమ్మండి... నేను దూతను.. "నన్ను ఆ దేవుడే ఇక్కడికి పంపాడు..." ఇప్పుడు మళ్ళీ ఒక నవ్వు.

మునుపటి కంటే బిగ్గరగా నవ్వు వినిపించింది. ఆ నవ్వు శబ్దం ఎక్కడి నుండి వచ్చిందంటే, అతని వెనుక, అదే హాలులో నుంచి! అక్కడ ఒక స్తంభానికి కట్టేసున్న మరొక వ్యక్తి కనిపించాడు. అతనిదే ఆ నవ్వు.

"నువ్వు ఎందుకు నవ్వుతున్నావు?"

"నువ్వు అబద్ధం చెబుతున్నావు... అందుకే నేను నవ్వుతున్నాను! "

"ఏ అబద్ధం గురించి నువ్వు మాట్లాడుతున్నావు?" "

"దేవుడు నిన్ను పంపాడని చెప్పడం అబద్ధం!"

"నీకెలా తెలుసు?"

"నేను నిన్ను పంపలేదు!"

ఇతను కంగుతిన్నాడు. అతని వైపు చూసాడు.

అతను జాలిగా అన్నాడు... "నేను దేవుడినని చెప్పాను. మిమ్మల్నందరినీ చూడటానికి వచ్చానన్నాను. అంతే, మరుక్షణం నన్నిక్కడ బంధించేసారు. నేనిక్కడ నెల రోజుల నుంచీ ఉన్నాను...."

"స్నేహితులారా!

నేను దేవుని దూతను అని కొందరు అంటారు. మరికొందరేమో నేనే దేవుడిని అని అంటారు.

ఇంతకూ నిజమైన దేవుడు ఎక్కడ ఉన్నాడు?"

ఒక వ్యక్తి ఒక జ్ఞానిని వెతుక్కుంటూ వెళ్ళాడు. "నేను దేవుడిని



కలవాలనుకుంటున్నాను!" అని అతను తన మనసులోని మాటను జ్ఞానితో చెప్పాడు. అంతే! మరుక్షణం ఆ జ్ఞాని అతని చెంప ఫెడేల్మని కొట్టారు.

అతను భయంతో వణికిపోయారు. అక్కడున్నవారు ఆ జ్ఞానిని చూసి అడిగారు "ఎందుకు స్వామీ అతన్ని కొట్టారు?"

"అతను పిచ్చివాడు!" అన్నాడు జ్ఞాని.

"నిజంగా?" "అవును! లేకుంటే ఏంటీ...అతను అతనినే వెతుకుతున్నాడు!"

**- యామిజాల జగదీశ్**

- గెలవాలన్న తపన తగ్గుముఖం పడితే ఓటమికి దగ్గరైనట్లే!
- క్షమించగలిగే మనస్తత్వం ఉన్నప్పుడు ప్రతిదానినీ అర్థం చేసుకోవడం తేలికవుతుంది.
- ఆలోచన మనిషికి దేవుడిచ్చిన వరం.

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

*sunmagvaartha@gmail.com*

# నిజాయితీతోనే.. గౌరవం!

"ఇతరులు నీ పట్ల ఎలా ప్రవర్తిస్తే నీకు బాధ కలుగుతుందో అలాంటి ప్రవర్తనను నువ్వు ఇతరుల పట్ల కలిగి ఉండకపోవడమే ధర్మాలలోకెల్లా గొప్ప ధర్మం" అని తిక్కన సోమయాజి మహా భారత ఇతిహాసం ద్వారా చెప్పిన మాట అనుక్షణం మన నోట్లో నానాల్సిన సుభాషితం. సత్యం పలకడం, న్యాయాన్ని పాటించడం, తల్లిదండ్రులను పెద్దలను గౌరవించడం, భూత దయ కలిగి ఉండడం.. ఇలా చెప్పుకుంటూ పోతే మనిషి తనను తాను ఉన్నతుడిగా తీర్చిదిద్దుకునేందుకు ఆచరించే ప్రతి మంచి పని ధర్మానుష్ఠానం కిందకే వస్తుంది. పంచ భూత సమ్మేళనమైన ఈ జగత్తులో 'ధర్మం' సర్వే సర్వదా వ్యాపించి ఉంటుంది. అటువంటి ధర్మం తనను అనునిత్యం ఆచరించిన వారిని కంటికి రెప్పలా రక్షిస్తూ ఉంటుంది. అదే సమయంలో తనను నాశనం చేయాలని చూసే మూర్ఖులను నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తుందన్న ఆర్యోక్తి మహిమాన్వితమైనది. కాబట్టి ఈ భూమ్మీదకు చుట్టపు చూపు కోసం వచ్చిన మనం ఇక్కడ ఉన్నన్నాళ్ళు ధర్మం చల్లని నీడలో హాయిగా బతికిపోవడానికి మించిన సౌభాగ్యం వేరేదైనా ఉంటుందా? అంటే కచ్చితంగా ఉండదనే సమాధానం చెప్పాల్సి వస్తుంది. అయితే ధర్మాన్ని ఆచరించే వాళ్ళను రక్షించే బాధ్యతను ఎల్లవేళలా ధర్మమే తీసుకోదు. ఎక్కువసార్లు ఆ బాధ్యతను ఈ చరాచర సృష్టిలో బుద్ధి జీవులమైన మన మానవ భుజస్కంధాలపైనే నిలుపుతుంది. ఇటువంటి గొప్ప అవకాశం నిజంగా మనకు తారసపడి, దానిని మనం ఒడిసిపట్టుకున్న రోజు కచ్చితంగా మన జీవితం ధన్యమైనట్టే. అటువంటి అపురూప అవకాశం ఒకానొకసారి భారతీయ విజ్ఞానశాస్త్రంలో కలికితురాయిగా కీర్తించబడే సర్ సి.వి.రామన్ జీవితంలో తారసపడింది. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన రామన్ ఆ అవకాశాన్ని ఒడిసిపట్టుకున్న విధానం మనకు ఆదర్శప్రాయం.



రామన్ ఎఫెక్ట్ కనుగొన్నందుకు 1930 సంవత్సరానికిగాను భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి సర్ సి.వి.రామన్‌ని వరించింది. ఆ స్ఫూర్తితో తన పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్ళడానికి రామన్ బెంగళూరులో 'రామన్ పరిశోధనా కేంద్రం' (ఆర్.ఆర్.ఐ) అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. ఈ విజ్ఞాన పరిశోధనా కేంద్రంలో పనిచేయడానికి నిపుణులైన ఉద్యోగులను అన్వేషించాల్సి వచ్చింది.

దీని కోసం ఆనాటి వార్తాపత్రికల్లో ఉద్యోగ ప్రకటనలు ఇచ్చారు. ఆ ప్రకటనలను చూసి వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగార్థులు బెంగళూరులోని రామన్ పరిశోధనా కేంద్రానికి తరలి వచ్చారు. వచ్చిన అభ్యర్థులకు ఆర్ఆర్ఐలో చెప్పిన సమయానికి పరీక్ష నిర్వహించారు. ఆ పరీక్ష ఫలితాలను అనుసరించి అర్హులైన వారిని తన సంస్థలో ఉద్యోగులుగా రామన్ నియమించుకున్నారు. ఉద్యోగ అర్హత పొందని వారికి రాను పోను ప్రయాణ ఖర్చులను ఇచ్చి పంపమని తన కార్యాలయ సిబ్బందిని రామన్ ఆదేశించారు. ఆ ఆదేశానుసారం వారు మిగిలిన వారందరికి ప్రయాణ ఖర్చులు ఇచ్చి పంపించేశారు. అయితే ఆ రోజు సాయంత్రం ఒక యువకుడు కార్యాలయం దగ్గరే తిరుగుతూ రామన్‌కు కనపడ్డాడు. ఉదయం పరీక్ష సమయంలో ఆ యువకుణ్ణి ఇదివరకే చూసి ఉండడం చేత గుర్తించిన రామన్ పిలిచి "నువ్వు ఉద్యోగానికి అర్హత పొందలేదని, నిన్ను వెళ్ళిపొమ్మని చెప్పాను కదా! ఇంకా ఇక్కడే ఎందుకు తిరుగుతున్నావు?" అని అడిగారు.

ఆ మాటలు విన్న యువకుడు "అయ్యా, మీ కార్యాలయ సిబ్బంది నా ప్రయాణానికి రాను పోను అయ్యే ఖర్చు కన్నా ఎక్కువ డబ్బు పొరపాటుగా ఇచ్చి ఉన్నారు. ఆ డబ్బులు తీసుకునేటప్పుడు ఉద్యోగం రాలేదన్న నిరాశలో ఉన్న నేను కూడా వాటిని లెక్క పెట్టకుండా జేబులో వేసుకున్నాను. ఆ తర్వాత జరిగిన పొరపాటుని గుర్తించాను. పరుల సొమ్ము పాము వంటిదని భావించి నాకు అదనంగా ఇచ్చిన డబ్బులను మీ కార్యాలయంలో ఇవ్వడానికి వచ్చాను. ఆ పని కూడా పూర్తి చేసుకుని ఇప్పుడు వెళ్ళిపోతున్నాను" అని వినయంతో చెప్పాడు.

ఆ యువకుడి నిజాయితీకి చలించిపోయిన రామన్ "మిత్రమా! ఇప్పుడు నేను ఎంపిక చేసిన వారితో పోలిస్తే నీలోని ప్రతిభ కొంత వెలితిగా ఉండి ఉద్యోగ సాధనలో నిన్ను వెనక్కి నెట్టిందేమో కానీ, నీ ధర్మనిరతి నిన్ను శిఖర సమానుడిగా మార్చింది. నీ సద్గుణాన్ని గుర్తించక పోతే నా మేధస్సుకి విలువే ఉండదు. కాబట్టి తక్షణమే నా సంస్థలో నిన్ను ఉద్యోగిగా నియమిస్తున్నాను. నీ వంటి నిజాయితీ పరుల అవసరం నా సంస్థకు ఎంతైనా ఉంది" అని చెప్పి ఆ యువకుడికి ఆర్.ఆర్.ఐలో ఉద్యోగం ఇచ్చారు. వాస్తవికమైన ఈ సంఘటనలో ఆ యువకుడు తన ధర్మ నిష్ఠను ప్రదర్శించిన సందర్భం ఎంత గొప్పదో, ఆ ధర్మ ప్రవర్తనను రక్షించే స్థితిలో ఉన్న రామన్ ఆ బాధ్యతను త్రికరణ శుద్ధిగా నిర్వర్తించిన తీరు కూడా కీర్తింపదగ్గది. ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని తప్పక రక్షిస్తుందని చెప్పడానికి ఇలాంటి సజీవ సాక్ష్యాలు మన చుట్టూ ఎన్నో దర్శనమిస్తాయి. మన ముందర భోజన పళ్ళెంలో పదార్థాలు వడ్డించి ఉన్నంత మాత్రాన అవి మన ఆకలిని తీర్చలేవు. వాటిని మనం తిన్నప్పుడు మాత్రమే ఆకలి తీరుతుంది. అలాగే మనం ధర్మం గురించి అవగాహన కలిగి ఉన్నంత మాత్రాన ధర్మాత్ములం కాలేం.

ఆ ధర్మాన్ని మనస్సు, వాక్కు, కర్మ అనే త్రికరణాల ద్వారా చిత్తశుద్ధితో ఆచరించడం, అలా ఆచరించిన వారికి మద్దతుగా నిలబడడం ద్వారానే మనం ధర్మాత్ములం కాగలం. ఇటువంటి ధర్మనిష్ఠ కలిగిన నడవడిక ఉన్నంత వరకు మన కార్యసాధనలో ఎన్ని ఆటంకాలు ఎదురొచ్చిన ఆ ధర్మమే మనకు అండగా నిలిచి విజయ ఢంకాలు మోగిస్తుంది.

– కాకి.అప్పల సత్యనారాయణ

# ఈవారం కవిత్వం

## లీలా విలాసం

ప్రభూ!
భౌతిక సూత్రాలు
తాత్విక ఆలోచనలకు అందని
నీ అనంత అస్తిత్వాన్ని
సత్య స్వరూపాన్ని
ప్రత్యక్షంగా వీక్షించడం
ఇక సాధ్యం కాదేమోనన్న సంశయం
మనసులో మబ్బులా కమ్ముకుంటూ
ఉంది.
ఈ సంశయాన్ని వీడి
ఆస్వాదించే హృదయం ఉంటే
అంతుచిక్కని అనంత ఆకాశంలో
జ్వలించే తారల తళుకుల్లో
నీలి అవర్ణ అలల మధ్య
తారాడే జాబిల్లి జిలుగుల్లో
ఉరిమే మేఘపు కన్నుల్లో
మెరిసే కాంతి కిరణాల్లో
కురిసే తొలకరి జల్లుల్లో
విరిసే అందాల హరివిల్లు రంగుల్లో
ప్రకృతి ఒడిలో పరిఢవిల్లే
వైవిధ్య భరిత కణజాలంలో
ప్రశాంత ప్రభాత సంధ్యలో
సడి చేయు పక్షుల శ్రావ్య సంగీత
శృతుల్లో
వీచే చిరుగాలి తరగలపై
తేలియాడే చందన సుగంధ పరిమళంలో
గలగల పారే సెలయేటి అలలపై
చిందులు వేసే చిరుచేపల విన్యాసంలో
వెల్లువలా పొంగే మమతావేశంలో
శిశువును ముద్దాడే మాతృత్వ తమకంలో
నీ దివ్య రహస్యం దాగి ఉందని
విచిత్రానుభూతితో
మనసు సమ్మోహనమౌతుంది.

– డా॥ సమ్మన్న ఈటెల

## గొప్ప 'ధనం'

శత్రువు గొప్పవాడై చీదరించినపుడు
కనీసం కసిదీరా తిట్టాలనిపించింది
కాని నా దరిద్రం అడ్డొచ్చింది.
శత్రువు చితికిపోయి చేయిజాచినపుడు
కసిదీరా తిట్టే అవకాశం కలిసొచ్చింది
కానీ నా సంస్కారం
అడ్డుగా నిలిచింది.
నిస్సహాయంగా వెనుదిరిగిన నాకు
విరిదండతో వరించేందుకు
గొప్పతనం వడివడిగా రావటం
కనిపించింది.

– ఆర్.వి.రాఘవరావు

## అహింసా స్వరూపమా!

అహింసకు
వెలుగుగా, శాంతి
దూతగా ఈ నేలపై
అవతరించిన
పుణ్యమూర్తీ!
ఆయుధం
పట్టకుండానే
యుద్ధ
రంగంలో
ప్రేమనే
అస్త్రంగా
విసిరావు!
అరగుడ్డ ధరించిన
తురవిగా అన్యుల
పాలనను
కదిలించివేశావు!
సత్య శోధన జీవితంతో లోకమంతా
సత్యాన్ని నెలకొల్పావు!
రాట్నం తిప్పిన చేతులతో స్వతంత్ర
బాటను పరిచిచ్చావు!
ఎలిమయి (సరళత్వ) రూపుగా...
మా దేశపితా... నువ్వు చూపిన
బాటలో నడుస్తాం, అహింసా
జ్యోతిని వెలిగిస్తాం!



– జి. సుందరరాజన్

## జ్వలన కణికలు

అక్షరాలు..
అనంత నిత్య చైతన్య
జ్వలన కణికలు!
పదాలు..
హృదయాలను రగిల్చే
భాస్వరపు గుళికలు!
పాదాలు..
కార్మిక కర్షక పీడిత
ధిక్కార కోపోద్వనులు!
కవి, పద్యం..
ఎల్లప్పుడూ స్వభావోక్తియే!
ఉపోపమానాల
ఉత్ప్రేక్షాలంకారమనుకునేరు !!
ఓ సత్కవీ!
జిందగీల ఒక్కటంటే ఒక్కటైనా
నిరసనవాక్యం రాయందే
ఏ కావ్యమైతే పరిపూర్ణం కాదు !!
పిరికిగుండెలను సైతం
పురిగొల్పి పిడికిలెత్తేలా సేయందే
నువ్వెప్పటికీ కవివైతే కానే కాలేవు !

– అశోక్ అవారి

## ప్రకృతి చూపు

పచ్చదనం కరువైన
ఆకాశం
నేల
చూపులు
చూస్తోంది
ఒక పచ్చని
మొక్క
కోసం..



తడారిన
తన దేహంపై
ఒక దుక్కు వానై
కురవాలని
చెట్లు
చేతులతో
ఆకాశానికి
భూమి
సైగ చేస్తోంది
వసంతం కోసం
వెన్నెల
నేలపై అరవిరిసిన
పచ్చదనాన్ని
నిలువెల్లా తాకి
పరవశమై
మురిసిపోతుంది.

– పొనుగుమట్ల అశోక్ కుమార్

## భగ్న ప్రేమ

కన్ను దాటిన కన్నీరు
కంటి చూపు దాచేనా
నువ్వు చల్లే పన్నీరు
ఇంకి పోవునెరుగవా
పూలు పూసే గన్నేరు
రాలిపోయే పువ్వు నేను
దాచినాను గంధాన్ని
పంచాలని ప్రకృతికంతా
కాచుకున్నా కానదా
గాలిలోని దీపము నేను
ఆరిపోయే ప్రాణాన్ని
వెలగాలని జీవితమంతా
చూస్తున్నా చేరవా
తేనె గ్రోలే తుమ్మెదనై
ఆశతోనే వెతుకుతున్నా
కానరాని నిన్ను వెతికి
తీర్చుకుంటా సంశయాన్ని
వెన్నెలింట్లో చందమామై
ఆశతో నే చూస్తున్నా
నీ కోసం ఎదురు
చూచె నీ చెలి
నువ్వే నేననే నెచ్చెలి.

కాదన్నా అవునన్నా నీ
ప్రియురాల్ని
నువ్వే సర్వం అనే
నీ భగ్న ప్రేమని.

– జి రామమోహన నాయుడు

## సింగిల్ పేజీ కథ

# చివరి కోరిక

రామారావు గారు రిటైర్డ్ హెడ్ మాస్టర్. ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్. చిన్న కొడుకు ప్రభుత్వ ఉద్యోగి. ఇద్దరి కొడుకులకు పెళ్ళి చేసి తను, ప్రభ కలసి కాశీ వెళ్లారు. చిన్న కొడుకు కృష్ణ, తన భార్య కృష్ణవేణితో కలసి సినిమాకు వెళుతూ "మీరు రండని కృష్ణ పిలిస్తే, పెద్దకోడలు రాధా "వద్దులే బాబు" అంది. దాంతో వాళ్లిద్దరే సినిమాకు వెళ్ళారు.

"అక్కయ్యా, మేం అటునుంచి అటే హోటల్‌కు వెళ్ళి భోజనం చేసి వస్తాం. మా కొరకు చూడకండి" అంది.

"సరేనమ్మా" అంది రాధ నవ్వుతూ. ఇంట్లో పెద్దకొడుకు రామం, రాధా మాత్రమే ఉన్నారు. మంచంపై పడుకుని పైకి చూస్తూ ఏదో ఆలోచనలో ఉన్నాడు రామం.

అప్పుడే వచ్చింది రాధ తాబులం ప్లేట్ పట్టుకుని. "ఏదో ఆలోచిస్తున్నారు" అంది ఆకు అందిస్తూ. "ఇంతవరకు నాన్న పెన్షన్‌తో కుటుంబం గడిచింది. ఈ నెల నుంచి ఎలా చేద్దాం? నాకు వచ్చేది అర, కొర జీతం. మే, జూన్ నెలలు జీతం రాదు. ఎలాగో అనారోగ్యం కారణంతో కాన్వాస్‌కు రాను" అని చెప్పాను అన్నాడు.

"వున్నదానిలోనే సర్దుకుందాంలెండి" అంది రాధ. "అది సరే జులైలో పనిచేస్తే ఆగస్టులో జీతం వస్తుంది. అంతవరకు ఎలా?" అన్నాడు దిగ్గున కూర్చుంటూ.

కృష్ణ ఉన్నాడు కదా అని రామం. రాధ ఎవరూ అనలేదు. కానీ అ మాటే కృష్ణ వేణి అంది.. "మీరు మీ అన్నతో ఏ ఖర్చు పెట్టనీకుండా కుటుంబ ఖర్చులు పెట్టండి" అంది స్కూటర్‌పై కూర్చుంటూ.

దానికి కృష్ణ చిన్నగా నవ్వి "నాకు తెలీదా అన్న పరిస్థితి. ఇంటి బాడుగ, కరెంటు, పాలు, సరుకులు వగైరా అన్నీ నేనే పెడతా! నీవు భయపడకు"అన్నాడు.

ఆ రోజు నుంచి ఇంటి ఖర్చులు అన్నీ కృష్ణనే పెడుతున్నాడు. పాలవాడికి డబ్బు ఇస్తుంటే "ఆగన్నయ్యా అని" కేక వేశాడు కృష్ణ. ఆగిపోయాడు రామం... "నువ్వేమి ఇవ్వకు... నేను ఇస్తా" అని పాలవాడికి డబ్బు ఇచ్చి డైనింగ్ టేబులు దగ్గర కూర్చొని "అన్నయ్యా, టిఫిన్ చేద్దాం రా" అన్నాడు.

టేబుల్ దగ్గరకు నడిచాడు రామం.

రాధ దోసెలు వేస్తుంటే కృష్ణవేణి వడ్డించింది. "అన్నా!" అన్నాడు కృష్ణ. అతని కళ్ళలోకి చూశాడు రామం.

"నాన్న వచ్చేవరకు, వారు వున్నా లేకపోయినా, మనిద్దరికీ పిల్లలు పుట్టినా వాళ్ళ ఖర్చు, ఇంటి ఖర్చు నేనే పెడతా. నికొచ్చేదే తక్కువ జీతం. ప్రైవేట్ కాలేజీలో వెట్టి చాకిరి. పైకి లెక్చరర్, లోపల అంతా యాజమాన్యం అడ్మిషన్‌ల గోల. నాకు తెలుసు అన్నయ్యా ప్రైవేట్ కాలేజీలా బాగోతం" అన్నాడు కృష్ణ.



రామం కళ్ళల్లో నుంచి కన్నీళ్ళు తొణికిసలాడాయి. "నేను ఈ ఇంటికి పెద్ద కొడుకును, ఖర్చు నేనే పెట్టాలి కృష్ణ" అన్నాడు. కృష్ణవేణి, రాధ ప్లేట్లలో దోసెలు వేసుకుని టేబుల్ దగ్గర కూర్చుని "వద్దు బావా మన కుటుంబం గురించి, మనుషులు గురించి పది మంది గర్వంగా చెప్పుకోవాలి. అన్నకు ప్రభుత్వ ఉద్యోగం లేదని, తన స్వార్థం చూసుకున్నాడు, తమ్ముడు" అని ఎవ్వరూ అనుకోకూడదు.

"మనం ఎప్పటికీ కలిసే ఉందాం. నాకు, రాధక్కకు మధ్య ఏ గొడవలు లేవు. పైగా మీరు పెద్దవాళ్ళు. ఆయన జీతం, వాళ్ళ వదినేకే ఇస్తాడు. రాధక్కనే కుటుంబం నడపాలి. మీరు కాదనకండి" అంది కృష్ణవేణి. రామం, కృష్ణ, కృష్ణవేణి కళ్ళలోకి చూసి "ఇంత మంచి మనసు మీ ఇద్దరికీ ఉండటం చాలా గొప్ప విషయం" అన్నాడు చేయి కదుక్కుంటూ. కృష్ణ కూడా పైకి లేచి "మనం ఎప్పుడు కలిసే ఉందాం" అన్నాడు.

అప్పుడే రామం ఫోనే మోగింది." హాలో "అన్నాడు. ఆ మాట వినగానే అతని కళ్ళల్లో నిర్వేదం, కన్నీళ్ళు జల జల కారుతుంటే "ఎలా జరిగింది?" అన్నాడు. ఏమీ అర్థం కాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు కృష్ణ, కృష్ణవేణి, రాధ.

కుప్పకూలిపోయాడు రామం. "అన్నయ్యా, ఏమైంది? ఫోన్ ఎక్కడి నుండి?" అడిగాడు. "తమ్ముడూ" అని బావురుమన్నాడు రామం. "ఏమండీ!" అంది రాధ. "అన్నయ్యా, ఏమైంది అడిగాడు కృష్ణ.

"అమ్మ, నాన్న కాశీలోనే.." అంటూ సైగ చేశాడు. రాధ, కృష్ణవేణిలకు విషయం అర్థం అయింది.

"ఎవరో తెలుగువాళ్ళే నాన్న జేబులో ఆధార్ కార్డు, పేపర్లో నా నంబర్ ఉందంట, వాళ్ళే ఫోన్ చేశారు. అంత్య క్రియలకు రమ్మన్నారు" అని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు.. రాధ, కృష్ణవేణి కన్నీళ్ళు కారుస్తున్నారు. వెంటనే కాశీకి పయనమయ్యారు. కాశీలో శివైక్యం కావడం గొప్ప పుణ్యం అన్నారు పండితులు.

తల్లితండ్రులకు పూల దండలు వేసి నమస్కరించారు అందరు. తల్లి, తండ్రి చేతులలో ఒక చీటి కనపడింది రామం, కృష్ణలకు. "మా తదనంతరం మీరు ఎప్పుడూ కలిసే ఉండాలి, విడిపోకూడదు. ఇదే మేం కోరే చివరి కోరిక" అని ఉంది ఆ చీటీల్లో.

"మేము ఎప్పుడు కిచులాడుకోం. కలిసే ఉంటాం. మీ కోరిక తీరుస్తాం. మీ పేరు నిలబెడతాం" అన్నారు అన్నదమ్ములు. ఆ రోజే ఘనంగా తల్లితండ్రులకు అంత్య క్రియలు చేసి "మీ చివరి కోరిక తీరుస్తాం అత్తయ్య, మావయ్య" అన్నారు కోడళ్ళు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని. ఆ మాటకు అన్న, తమ్ముడు ఇద్దరూ సంతోషించి అందరూ బాధా తప్త హృదయాలతో తిరుగు ప్రయాణమయ్యారు.

– కనుమ ఎల్లారెడ్డి

# మానవాళికి దివ్య మార్గదర్శనం

**"నా జీవితమే నా సందేశం" అని నినదించిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ జీవన ప్రస్థానం సమస్త మానవాళి అంతఃచేతనను మేల్కొలిపిన ఒక మహోజ్వల యుగ దిక్సూచి. అణుబాంబులు, తుపాకీ గొట్టాల పెత్తనం రాజ్యమేలుతున్న ప్రపంచంలో, చేత ఏ ఆయుధం పట్టకుండానే సత్యం అనే ధర్మదండంతో, అహింస అనే వజ్రాయుధంతో బ్రిటిష్ సామ్రాజ్యవాద పునాదులను కదిలించిన నైతిక విప్లవకారుడాయన.**

బలప్రయోగం లేకుండానే అజేయ శక్తిపై నైతిక విజయం సాధించవచ్చని నిరూపించినందుకే, ఆయన జయంతి రోజైన అక్టోబర్ 2ను ఐక్యరాజ్యసమితి 2007లో ఏకగ్రీవంగా 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించి విశ్వవ్యాప్త గౌరవాన్ని చాటింది.

1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్, తల్లి నేర్పిన ధార్మిక చింతన, హరిశ్చంద్రుని సత్యనిరతితో సత్ప్రవర్తనను అలవరచుకున్నారు. లండన్‌లో బారిస్టర్ చదివి భారత్‌కు తిరిగివచ్చినప్పటికీ, 1893లో దాదా అబ్దుల్లా కంపెనీ వ్యాజ్యం కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లడం ఆయన జీవితాన్ని అనూహ్య మలుపు తిప్పింది.

పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌లో మొదటి తరగతి టికెట్ ఉన్నా కేవలం వర్ణవివక్షతో రైలు నుంచి గెంటేసిన ఆ అవమానమే ఆయనలో ఆత్మగౌరవ జ్వాలను రగిలించింది. అక్కడ ప్రవాస భారతీయుల హక్కులకై 'నటాల్ ఇండియన్ కాంగ్రెస్' స్థాపించి, రస్కిన్, టాల్‌స్టాయ్‌ల స్ఫూర్తితో సామూహిక జీవనం సాగిస్తూ 'సత్యాగ్రహం' అనే పోరాట అస్త్రాన్ని సానబెట్టారు.

రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే పిలుపుతో 1915లో స్వదేశానికి వచ్చిన గాంధీజీ, మూడో తరగతి రైలు డబ్బాల్లో దేశమంతటా పర్యటించి సామాన్యుల కష్టాలను అర్థం చేసుకున్నారు. 1917లో చంపారన్ రైతుల 'తీన్‌కథియా' విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన సత్యాగ్రహం ఆయనకు తొలి విజయాన్ని అందించగా, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయనకు 'మహాత్మా' బిరుదునిచ్చారు. అనంతరం ఖేడా రైతుల పన్ను రద్దు, అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మెలలో విజయాలు సాధించి శ్రామిక, కర్షక జనుల పక్షపాతిగా నిలిచారు. స్వరాజ్యం అంటే విదేశీ పాలన మార్పు మాత్రమే కాదని, పేదరికం, భయం, అస్పృశ్యతల నుంచి విముక్తి అని చాటారు.

1919 జలియన్ వాలాబాగ్ మారణకాండ అనంతరం 1920లో సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించి కోర్టులు, పాఠశాలలు, విదేశీ వస్త్రాల బహిష్కరణతో బ్రిటిష్ యంత్రాంగాన్ని స్తంభింపజేశారు. అయితే 1922లో చౌరీచౌరా హింసాత్మక ఘటనతో కలతచెంది ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు. లక్ష్యం ఎంత పవిత్రమో, మార్గం కూడా అంతే పవిత్రంగా ఉండాలన్నది ఆయన సిద్ధాంతం.

1930 మార్చి 12న సబర్మతి నుంచి దండి వరకు 240 మైళ్ల కాలినడకన సాగించిన 'ఉప్పు సత్యాగ్రహం' శాసనోల్లంఘన విప్లవమై దేశాన్ని కుదిపేసింది. చివరగా 1942లో 'డూ ఆర్ డై' అంటూ ఇచ్చిన 'క్విట్ ఇండియా' పిలుపుతో పరాయి పాలన అంతమై, 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ విభజన రక్తపాతంతో కలతచెందిన గాంధీజీ, అధికార సంబరాలకు దూరంగా నౌఖాళీ, కలకత్తాలలో శాంతి కోసం ఉపవాస దీక్షలు చేపట్టారు.

- మూర్ఖుని హృదయం నాలుక మీద ఉంటుంది. వివేకవంతుని నాలుక హృదయంలో ఉంటుంది.
- జీవితంలో మమతలు పెంచుకున్నవాడు, అదే కాలంలో మృత్యుభయాన్ని హెచ్చించుకుంటాడు.
- చెట్టునీడలోని సుఖం తెలిసినవాడు గొడ్డలి పట్టుకొని కొమ్మలు కొట్టడు.
- భయం, కోపానికి లోనుగాకుండా ఉండేవాళ్లే ఉత్తములు అవుతారు.

గాంధేయ ఆలోచనల్లో చరఖా స్వావలంబనకు ప్రతీక. భారతదేశ ఆత్మ పల్లెల్లోనే ఉందని చాటిన 'గ్రామ స్వరాజ్యం' పంచాయతీరాజ్ వ్యవస్థకు పునాది అయింది. సంపన్నులు తమ సంపదకు ధర్మకర్తలుగా ఉండాలన్న 'ట్రస్టీషిప్'



విధానం, అణగారిన వర్గాలను 'హరిజనులు'గా పేర్కొంటూ అస్పృశ్యతపై సాగించిన పోరాటం సామాజిక సమతుల్యతను చాటాయి. 1948 జనవరి 30న నాథూరాం గాడ్సే తూటాలకు 'హే రామ్' అంటూ ఆయన నేలకొరిగినా, ఆయన మార్గం మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా వంటి ఎందరో విశ్వనేతలకు స్ఫూర్తిగా నిలిచింది.

"నేటి సాంకేతిక యుగంలో యుద్ధాలు, తీవ్రవాదం, అసహనం, తీవ్ర పర్యావరణ సంక్షోభాలు పెరుగుతున్న వేళ "ప్రకృతి మానవుడి అవసరాలను తీర్చగలదు కానీ, దురాశను కాదు" అన్న గాంధీజీ మాటలు అత్యంత ప్రాసంగికమైనవి. గాంధీకి విగ్రహాలు, ప్రసంగాలతో సరిపెట్టడం నిజమైన నివాళి కాదు; ఆయన ప్రబోధించిన సర్వోదయం, సత్యనిష్ఠ, అహింస, పర్యావరణ పరిరక్షణలను ఆచరణలో పెట్టడమే జాతిపితకు అర్పించే నిజమైన అక్షర నివాళి.

**– రామకిష్టయ్య సంగనభట్ల**

# ప్రపంచాన్ని కలిపే ప్రయాణం

మానవ చరిత్రను అవలోకనం చేస్తే పరిణామక్రమమంతా అన్వేషణలతో, సంచారాలతో ముడిపడి ఉన్న సత్యం బోధపడుతుంది. ఒక ప్రాంతం సరిహద్దులు దాటి మరో ప్రాంతానికి వెళ్లడం, ప్రకృతి రమణీయతను తనివితీరా ఆస్వాదించడం, ప్రాచీన శిలా విన్యాసాలను స్పృశించడం, విభిన్న జాతుల ఆచార వ్యవహారాలను తెలుసుకోవడం కేవలం బాహ్య నేత్రాలకు వినోదం పంచే ప్రక్రియ మాత్రమే కాదు. మనిషిని మనిషితో, జాతిని జాతితో, గతాన్ని వర్తమానంతో, ఒక సంస్కృతిని మరో సంస్కృతితో అపూర్వంగా అనుసంధానించే మహత్తర సాంఘిక సంధానకర్త పర్యాటకం.

"దేశాటనం, పండిత మైత్రి, సభలలో నేర్పు, నానా శాస్త్ర పరిశీలనం మనుజునకు వివేకమును కలుగజేయును" అని పెద్దలు పలికిన సూక్తి ప్రయాణాల అంతస్సారాన్ని స్పష్టం చేస్తోంది. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 27వ తేదీన జరుపుకునే ప్రపంచ పర్యాటక దినోత్సవం క్యాలెండర్ పుటల్లో ఒక ఉత్సవ సందర్భం మాత్రమే కాదు; సమగ్ర ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి కల్పన, కళా సాంస్కృతిక పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేసే అంతర్జాతీయ సమాలోచన వేదిక. ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థకు సంబంధించిన మూల రాజ్యాంగం 1970 సెప్టెంబరు 27న అధికారికంగా ఆమోదం పొందింది.

కాలక్రమంలో పర్యాటకం ఒక సాధారణ కాలక్షేప విహారం నుంచి జగతిని నడిపించే బృహత్తర ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఒక పర్యాటకుడు ఒక ప్రాంతంలో అడుగుపెట్టిన క్షణం నుంచి అతనికి అవసరమైన రవాణా, భోజన వసతి, ఆతిథ్యం, దారి చూపే మార్గదర్శకుల సేవలు, స్థానిక హస్తకళలు, చేనేత వస్త్రాలు మట్టికళలు, గ్రామీణ ఉత్పత్తుల అమ్మకాలు ముమ్మరమవుతాయి. తద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాల వరకు ద్రవ్య ప్రవాహం విస్తరించి స్థానిక ఆర్థిక చక్రం వేగంగా తిరుగుతుంది. పర్యాటక రంగంలో చేసే పెట్టుబడి కేవలం భవనాలకో, రహదారులకో పరిమితం కాదు; అది ఒక సమాజపు ఆర్థిక స్వయంప్రతిపత్తికి, నవచైతన్యానికి ప్రాణవాయువు వంటిది.



ఈ శతాబ్దపు పర్యాటక ప్రస్థానంలో కరోనా మహమ్మారి పెను విలయాన్ని సృష్టించింది. సరిహద్దులు మూతపడి, గగనతల విమానయానం స్తంభించిపోయి, ప్రపంచం నాలుగు గోడలకే పరిమితమైన వేళ పర్యాటక రంగం కుప్పకూలింది. కోట్లాది మంది జీవనోపాధి గాల్లో దీపమైంది. అయితే సంక్షోభం శాశ్వతం కాదంటూ మానవజాతి చూపిన అద్భుత పునరుత్థానంతో ఈ రంగం ఊహకందని వేగంతో పుంజుకుంది. ఐక్యరాజ్యసమితి పర్యాటక సంస్థ గణాంకాల ప్రకారం 2024 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు సుమారు 140 కోట్లకు చేరి, సంక్షోభ పూర్వ వైభవాన్ని చేరుకున్నాయి. 2025 తొలి త్రైమాసికంలోనే అంతర్జాతీయ ప్రయాణాలు అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 5 శాతం పురోగతిని నమోదు చేసుకుని 30 కోట్లు దాటడం ఈ రంగానికున్న తిరుగులేని జీవశక్తికి నిదర్శనం. అయితే ఈ సంఖ్యాపరమైన దూకుడు మాత్రమే ప్రగతికి నిజమైన కొలమానం కాబోదు. లక్షలాది మంది తరలివచ్చినా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు పెరగకపోతే, శతాబ్దాల చారిత్రక సంపద ధ్వంసమైతే, ప్రకృతి కాంత విలపిస్తే, పవిత్రమైన సంస్కృతి బజారు సరుకుగా మారిపోతే ఆ అభివృద్ధి నిస్సారమైనదిగా మిగిలిపోతుంది. అందుకే నేటి ఆధునిక ప్రపంచంలో 'సుస్థిర పర్యాటకం' (సస్టైనబుల్ టూరిజం) ప్రధానాంశంగా మారింది.

ప్రకృతి రమణీయతను అనుభవించడానికి వెళ్లి ఆ ప్రకృతినే చెరబట్టడం అసలైన పర్యాటక లక్షణం కాదు. కొండకోనలు, జీవనదులు, సముద్రపు తీరాలు, పచ్చని అరణ్యాలు, అమాయక వన్యప్రాణుల జీవవైవిధ్యాన్ని కాపాడుతూ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. బాధ్యతారాహిత్యంతో వెదజల్లే ప్లాస్టిక్ వ్యర్థాలు, నీటి కాలుష్యం, హద్దులు లేని కాంక్రీట్ కట్టడాల నిర్మాణాలు, శబ్ద కాలుష్యం మన పర్యాటక కేంద్రాల ప్రాభవాన్ని బుగ్గిపాలు చేస్తున్నాయి. 2013 నాటి ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'పర్యాటకం-నీరు మన ఉమ్మడి భవిష్యత్తును పరిరక్షించడం' అనే ఇతివృత్తాన్ని తెరపైకి తెచ్చి, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పర్యాటక విలాసాల కోసం స్థానికుల దాహార్తిని విస్మరించ కూడదని ప్రపంచ పర్యాటక సంస్థ హెచ్చరించింది. ప్రకృతిని పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిగా కాక, భావితరాల నుంచి స్వీకరించిన పవిత్రమైన అప్పుగా భావించి కాపాడుకోవలసిన చారిత్రక బాధ్యత నేటి తరంపై ఉన్నది.

పర్యాటకం ఏ జాతికైనా సాంస్కృతిక జీవనాడి. దేవాలయాలలోని శిల్పకళా సౌందర్యం, ఆకాశాన్నంటే ప్రాచీన కోటబురుజులు, రాతి యుగం నాటి అవశేషాలు, జానపద నృత్యాలు, సంగీతం, స్థానిక వంటకాలు, పండుగలు ఒక ప్రాంతపు ఆత్మగౌరవ ప్రతీకలు. మహాకవి గురజాడ అప్పారావు "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నట్లు పర్యాటకమంటే భూభాగాన్ని చుట్టిరావడం మాత్రమే కాదు; అక్కడి మానవ జీవన వైవిధ్యాన్ని, సంస్కృతిని ప్రేమతో అర్థం చేసుకోవడం. ఒక బాటసారి మారుమూల పల్లెను దర్శించి అక్కడి చేతివృత్తుల కళాకారుడి నుంచి ఒక వస్తువును సగౌరవంగా కొనుగోలు చేసినప్పుడు, అది ఆ పేద కళాకారుడి కుటుంబానికి దక్కే బువ్వ మాత్రమే కాదు; అంతరించిపోతున్న ఒక అపురూప సాంప్రదాయ కళకు జీవం పోసే దీవెన కూడా అవుతుంది. భారతదేశం పర్యాటక రంగానికి ప్రపంచంలోనే అసమానమైన గని. మంచుదుప్పట్లు కప్పుకున్న హిమాలయాల శిఖరాగ్రాల నుంచి సాగరాల సంగమ క్షేత్రమైన కన్యాకుమారి వరకు, బంగారు వర్ణపు థార్ ఎడారి నుంచి నిత్యహరిత ఈశాన్య ప్రాంతాల ప్రకృతి సోయగాల వరకు, శిల్పకళా విస్మయాలైన అజంతా-ఎల్లోరా గుహల నుంచి ఖజురహో దేవాలయాల వరకు, ఆధ్యాత్మిక పుణ్యభూములైన వారణాసి నుంచి రామేశ్వరం వరకు దేశం..

దేశం అడుగడుగునా జీవకళతో తొణికిసలాడుతోంది. భారతీయ సంస్కృతి అందించిన 'అతిథి దేవోభవ' అనే ఉదాత్త భావన అంతర్జాతీయ పర్యాటక రంగానికే ఒక మకుటం. 2024 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రపంచ పర్యాటక సంస్థ కూడా ఈ 'అతిథి దేవోభవ' సంప్రదాయాన్ని గౌరవం, పరస్పర అవగాహన, సాంస్కృతిక మార్పిడి, విశ్వశాంతికి మూలస్తంభంగా ప్రశంసించింది. భారత పర్యాటక రంగాభివృద్ధిని అధికారిక గణాంకాలు స్పష్టంగా ధ్రువీకరిస్తున్నాయి.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2024లో దేశానికి 99.52 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, వివిధ రాష్ట్రాలలో నమోదైన దేశీయ పర్యాటకుల సందర్శనలు ఏకంగా 294.82 కోట్లకు చేరాయి. ఆ ఏడాది దేశానికి పర్యాటకం ద్వారా లభించిన విదేశీ మారకద్రవ్య ఆదాయం సుమారు రూ.2.93 లక్షల కోట్లు. ఇక 2025 నాటికి దేశీయ పర్యాటక సందర్శనలు అనూహ్యంగా పుంజుకుని దాదాపు 428.69 కోట్లకు పెరిగాయి; అంతర్జాతీయ పర్యాటకుల రాక 2.022 కోట్లకు, అందులో విదేశీ పర్యాటకుల రాక 91.5 లక్షలకు చేరి భారత ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి రంగానికి కొండంత ఊతమిచ్చాయి.

దేశీయ యాత్రికులను ఆకర్షించడంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు అగ్రగామిగా నిలవగా, విదేశీ పర్యాటకులను ఆహ్వానించడంలో మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, రాజస్థాన్ కీలక భూమిక పోషించాయి.

ఈ సమగ్ర పర్యాటక పటంలో తెలంగాణ రాష్ట్రం ఒక అపురూప మణిహారంలా ప్రకాశిస్తోంది. రాజసానికి

> – అవకాశం వచ్చినప్పుడే పట్టుకోవాలి. లేకుంటే బట్టతల మీద నూనెచుక్క జారినట్టు జారిపోగలదు.
>
> – మనిషి రెండు అంశాలు దాచిపెట్టడం కష్టం. మొదటి తాను తాగి వున్న విషయం; రెండోది: తాను ప్రేమించిన విషయం.
>
> – పురుషుని వయస్సు అతడి భావనను బట్టి ఉంటుంది. తరుణి వయస్సు ఆమె సౌందర్యాన్ని బట్టి ఉంటుంది.

ప్రతీకగా నిలిచే గోల్కొండ కోట, చార్మినార్, ప్రాచీన నాగరికతకు దర్పణమైన కాకతీయుల శిల్పకళా వైభవం, వెయ్యి స్తంభాల గుడి, భద్రాచల రామాలయం, యాదాద్రి లక్ష్మీనరసింహ క్షేత్రం, వేములవాడ రాజన్న, ధర్మపురి, కొండగట్టు ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రాలు భక్తిప్రపత్తులతో పాటు చారిత్రక ప్రాధాన్యాన్ని నింపుకున్నాయి. నాగార్జునసాగర్ జలాశయం, జాలువారే కుంటాల, బొగత జలపాతాలు, దట్టమైన ఆదిలాబాద్ అడవులు పర్యావరణ ప్రేమికులకు స్వర్గధామాలు. ప్రత్యేకించి యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన పాలంపేటలోని రామప్ప దేవాలయం తెలంగాణ శిల్ప చాతుర్యాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అంతర్జాతీయ వేదికపై శిఖరాన నిలబెట్టింది. తేలియాడే ఇటుకలు, ఇసుక పునాదులో నిర్మించిన ఈ అద్భుత నిరానమణం మన వారసత్వ ఔన్నత్యానికి తిరుగులేని సాక్ష్యం. ఈ చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి క్షేత్రాలను సమీకృత పర్యాటక వలయాలుగా (టూరిజం సర్క్యూట్లు) అభివృద్ధి చేసి, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే మౌలిక వసతులను కల్పించవలసి ఉంది.

గ్రామీణ పర్యాటకం ఆర్థిక స్వావలంబనకు కొత్త బాటలు వేయగలదు. పల్లెటూరి వాతావరణం, మట్టి వాసనలు, కట్టెల పొయ్యి ఘుమఘుమలు, చేనేత మగ్గాల చప్పుళ్ళు, వెదురు, కొయ్య బొమ్మల తయారీ, జానపద గేయాలు, వ్యవసాయ క్షేత్రాల పరిశీలనలను పర్యాటకంతో అనుసంధానిస్తే గ్రామీణ యువత పట్టణాలకు వలస వెళ్లవలసిన దుస్థితి తప్పుతుంది. మహిళా సంఘాలు, స్వయం ఉపాధిదారులు, రైతులు, కళాకారులు ఈ విలువ గొలుసులో భాగస్వాములై గ్రామాలే స్వావలంబన కేంద్రాలుగా వర్ధిల్లుతాయి. దీనితో పాటే సమాజంలోని వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు ఎటువంటి ఆటంకాలు లేకుండా సురక్షితంగా, సులభంగా ప్రయాణాలు సాగించేలా రవాణా సౌకర్యాలు, వసతి, అధునాతన మరుగుదొడ్లు, స్పష్టమైన సమాచార వ్యవస్థను అందుబాటులోకి తేవడం సంస్కారవంతమైన సమాజం కర్తవ్యం. పర్యాటకం కొందరికే పరిమితమైన విలాసంగా కాక, సర్వజనుల హక్కుగా, అనుభవంగా విస్తరించాలి.

నేటి యుగంలో సాంకేతిక విప్లవం పర్యాటక ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తోంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డిజిటల్ మాధ్యమాలు పర్యాటక పరిశ్రమలో సరికొత్త విప్లవానికి తెరతీశాయి. 'డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం' అనే నినాదం పర్యాటక వ్యవస్థ పునర్నిర్మాణానికి వేదికవుతోంది. ప్రయాణీకుల అభిరుచులకు తగినట్లు ప్రయాణ ప్రణాళికలు రూపొందించడం, అనేక భాషల్లో ఏకకాలంలో సమాచారాన్ని అందించే ఏఐ గాడ్జ్లు, రద్దీ సమయాలను ముందే ఊహించి హెచ్చరించే సాంకేతికతలు, వాతావరణ మార్పుల ముందస్తు సమాచారం, వర్చువల్ రియాలిటీ ద్వారా ప్రాచీన ప్రదేశాలను అనుభూతి చెందడం, కాగిత రహిత స్మార్ట్ టికెటింగ్ సేవలు పర్యాటకుల సమయాన్ని, శ్రమను ఆదా చేస్తున్నాయి. అయితే ఈ సాంకేతికత మానవ సంబంధాలను దూరం చేయకుండా, పర్యాటకుని ప్రయాణ అనుభవాన్ని మరింత సులభతరం చేసే సాధనంగా మాత్రమే నిలవాలి. వ్యక్తిగత గోప్యత, సమాచార భద్రత, సైబర్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడం అంతే కీలకం.

జాతుల మధ్య వైషమ్యాలను తొలగించి, స్నేహభావాలను చిగురింపజేసే శక్తి ప్రయాణాలకు ఉంది. పరస్పర సంభాషణలు, ముఖాముఖి భేటీలు అపోహలను తుడిచిపెట్టి పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయి. అందుకే ఐక్యరాజ్యసమితి 'పర్యాటకం–శాంతి' అనే భావనను ప్రపంచ శాంతి స్థాపనకు మూలసూత్రంగా చాటింది. ఒక కోటను పరిరక్షించడం అంటే ఒక రాతి నిర్మాణాన్ని కాపాడటం కాదు, నాటి చారిత్రక వైభవాన్ని కాపాడటం.

ఒక జానపద కళాకారుడికి దన్నుగా నిలవడం అంటే ఒక సంప్రదాయ జీవనశైలికి ఊపిరి పోయడం. ఒక అడవిని సంరక్షించడం అంటే భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించడం. బాధ్యతాయుతమైన పర్యాటకమే ప్రగతికి అసలైన తారకమంత్రం. మనిషి నడిచిన నేల కాలుష్యంతో కన్నీరు పెట్టకుండా, పర్యాటకుడు కదిలిన బాటలో సంస్కృతి మాసిపోకుండా సాగే నైతిక ప్రయాణాలే వర్తమానానికి అవసరం.

**– రామకిష్టయ్య సంగనభట్ల**

కథ

# కుందేలు తెలివి

అనగనగా ఒక అడవి. ఆ అడవిలోకి ఎక్కడ్నుంచో ఒక సింహం వచ్చి, అన్ని పెద్ద జంతువుల్ని వేటాడి, చంపి తింటూ ఆనందించసాగింది.

మంచి మనసున్న ఒక తెలివైన కుందేలు సింహం దగ్గరకు వెళ్లి "నువ్వు ఇలా చేయటం ఏం బాగోలేదు" అంది సింహంతో.

"పో... పోవే . బుల్లి జంతువైన నీవు నాకు బుద్ధి చెప్పేదానివా? నా ఇష్టం. నేను నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను. బలవంతులదే రాజ్యం. బలవంతులకే అన్నీ చెందుతాయి" అని పొగరుగా చెప్పి , వేటాడడానికి వేగంగా ముందుకు వెళ్ళిపోయింది, సింహం.



దారిలో దానికి ఒక జింక కనిపించింది. దాని మీదకి వేగంగా లంఘించబోయింది సింహం.

ఆ అడవిలో ఉండే దీనికన్నా బలమైన ఇంకో సింహం వచ్చి, ఈ జింకను చూసి, ఆ సింహం కూడా ఈ జింక మీదకే లఘించ బోయింది.

ప్రమాదం కనిపెట్టిన జింక వేగంగా పరుగెత్తి, రెండు సింహాలకి దొరక్కుండా పారిపోయింది.

"నీ వల్లనే ఇలా జరిగింది" అంటే–

"కాదు.. కాదు.. నీ వల్లనే ఇలా జరిగింది" అని రెండు సింహాలు పోట్లాడుకున్నాయి.

ఆ అడవిలోని ఆ బలమైన సింహం ధాటికి, ఎక్కడినుంచో వచ్చిన సింహం తట్టుకోలేక ఒళ్ళంతా గాయాలై పారిపోయింది.

పారిపోతున్న ఆ సింహానికి కుందేలు ఎదురై "నువ్వు బలవంతుడివి కదా! ఈ గాయాలేమిటి?" అని అడిగింది.

"నేనే బలవంతుడ్ని అని ఇంతకాలం విర్రవీగాను. నాకంటే బలవంతులుంటారని ఇప్పుడే తెలుసుకున్నాను. ఎవరు ఎంత గొప్పవాళ్ళయినా.. నేనే గొప్పవాడ్ని అని విర్రవీగకూడదు. మనకంటే గొప్పవాళ్ళు వుంటారని గ్రహించాలి. అందరి పట్ల వినయ విధేయతలతో, ప్రేమాభిమానాలతో మెలగాలి" అని ఇప్పుడే అర్థం చేసుకున్నాను. ఇప్పుడు నాకు బుద్ధొచ్చింది. నా అడవిలోకి వెళ్లి బుద్ధిగా జీవిస్తాను" అని ఆ గాయపడ్డ సింహం వెళ్లిపోయింది.

అడవికి రాజైనా, మంచి మనసున్న, శాకాహారైన, బలమైన సింహానికి, ఎక్కడ్నుంచో వచ్చిన సింహం ఆగడాలు చెప్పి, దాని మీదకు ఉసి గొల్పి, మేత మేస్తున్నట్లుగా జింకని ఏర్పాటు చేసి, ఎక్కడ్నుంచో వచ్చిన సింహం పీడ విరగడ చేసిన సంగతి, కుందేలు జంతువుల దగ్గరకు వెళ్లి విపులంగా చెప్పి, వాటిలోని భయాన్ని పోగొట్టి, ధైర్యం కలిగించింది.

ఎక్కడ్నుంచో వచ్చిన సింహం పీడ విరగడ అయినందుకు, జంతువులన్నీ ఎంతో సంతోషించి, మంచి మనసున్న కుందేలు తెలివికి జేజేలు పలికాయి. ఆనాటి సంతోషంగా కలిసి మెలిసి జీవించాయి.

– మా.శ్రీ.రాజు, పాల్వంచ







## బాలగేయం

### చిరునవ్వు

చిరునవ్వులోని హాయి
వసంతమోయి
తొలకరి పులకింతోయ్
చైత్రపు చిగురింతోయ్
కరిమబ్బు పలకరింతోయ్
చెలికత్తె నిదుర స్వప్నమోయ్
సుదీర తీరాల
ఆనంద పరవశమోయ్
తేట తెనుగు చెనుకోయి
పడుచు తనపు పొగరోయ్
వర్షపు చినుకోయి
కోకిలమ్మ కూతోయ్
మధుమాసపు మామిడి పూతోయి
పాపాయి చెక్కిలోయ్
అమ్మ స్థన్యపు స్పరశోయ్
ఆడపిల్ల అరనిమిలిత నేత్రమోయ్
చిరునవ్వులోని హాయి
వెల కట్టలేనిదోయి
ఓ కనుదోయి నీ చూపు భావాలు
చిరునవ్వుకు మేలవించవోయ్

– రాళ్లబండి సంగం నాయుడు

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎల్.మోహన్, బాసర

ప్రశ్న: వజ్రం ఎలా ఏర్పడుతుంది?

**జవాబు:** వజ్రం స్ఫటిక రూపంలో ఉండే బొగ్గు వంటిది. భూ అంతర్భాగాలలో లభిస్తుంది. వజ్రం ఉష్ణవాహకమే అయినా దీనిగుండా విద్యుత్ ప్రవహించదు. సహజ వజ్రాలనేవి గనుల నుంచే వెలికి తీస్తారు. ఇది 900 డిగ్రీ సెంటీగ్రేడ్‌లో కాలడం ప్రారంభమై నెమ్మదిగా వాతావరణంలోని ప్రాణవాయువుతో కలిసి బొగ్గుపులుసు వాయువు(కార్బన్ డై ఆక్సైడ్)గా మారుతుంది. భూ అంతార్భగాలలోని అత్యధిక ఉష్ణోగ్రతలో బొగ్గు వజ్రంగా రూపాంతరం చెందుతుంది. ప్రపంచ స్థాయిలో ఆఫ్రికా ఖండంలో సహజ వజ్రాలు అధికంగా లభిస్తాయి.

#### వజ్రాలు–రకాలు

వజ్రాలు నాలుగు రకాలుగా ఉంటాయి. రంగు, స్వచ్ఛత, సాన పెట్టిన తీరు, క్యారెట్. వజ్రం విలువను నిర్ధారించే వాటిలో ప్రధానమైనది రంగు. ఏ రంగూ లేని వజ్రం నుంచి లేత పసుపు రంగు వరకు వజ్రాలు లభిస్తుంటాయి. వజ్రంలోని వర్ణాలను కూడా వివిధ గ్రేడ్‌లుగా విభజిస్తారు. ఇవి 'డి' నుంచి 'జడ వరకు ఉంటాయి. ఒకొక్క అక్షరం ఒకొక్క రంగును సూచిస్తుంది. ఉదాహరణకు 'డి' గ్రేడ్ అంటే ఏ రంగూ లేని వజ్రమని అర్థం. 'జడ్' గ్రేడ్‌కు చెందినట్లు చెప్పనట్లయితే దాని రంగు లేత పసుపు వర్ణం కాగలుగుతుంది.

డి,ఇ,ఎఫ్ = వర్ణరహితం; జి,హెచ్,ఐ,జె = దాదాపు వర్ణరహితం; కె,ఎల్,ఎమ్ = అతిలేత పసుపు రంగు; ఎన్ నుంచి జడ్ వరకు = లేత పసుపు రంగు.





కథ

# వీలునామా

అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు

"రావాల్సిన వాళ్ళందరూ వచ్చారు కదా! ఇంకెందుకు ఆలస్యం కానివ్వమనండి ఆ పంపకాలేవో?" అంటూ పెద్ద కోడలు సూర్యకళ అనగానే–

"ఉండవే కాసేపు.. మా చంటి బాబాయ్ వస్తున్నారు రాగానే మొదలెట్టేద్దాం" అని రాము అంటూండగా–

"ఏరా అబ్బాయ్ అందరూ వచ్చేసారా? నాదే ఆలస్యమా? వచ్చేసాను కదా! ఏవండోయ్ లాయర్ విశ్వనాథం గారూ! చదవండి, మా అన్నయ్య చంద్రయ్య ఏమి రాసారో? ఆ వీలునామాలో" అని చంటి బాబాయ్ అనగానే "అయ్యా అందరూ జాగ్రత్తగా వినండి, మీ నాన్న చంద్రయ్య గారు రాసిన వీలునామా చదువుతున్నాను" అంటూ చాలా విపులంగా చదివాడు లాయర్ విశ్వనాథం.

"అదేమీ కుదరదు ఊరి సెంటర్‌లో ఉన్న ఆ షాపింగ్ కాంప్లెక్స్ మాకు కావాలి" అని రెండో కోడలు చంద్రకళ అనగానే– "అదెట్లా కుదురుతుంది? మా నాన్నకు నేనంటే ఎంతో ఇష్టం కాబట్టే ఆ షాపింగ్ కాంప్లెక్స్ నాకు రాసాడు. ఏది ఏమైనా ఆ షాపింగ్ కాంప్లెక్స్ వదులుకునే ప్రసక్తే లేదంటూ" కూతురు శశికళ గట్టిగా అరిచింది.

"ఓసేవ్ శశీ, ఎందుకంత గట్టిగా అరుస్తావ్? అసలే నీది బక్క ప్రాణం. నాకా లోక జ్ఞానం అంతగా తెలియదు. బావలు మనకి సరైన న్యాయమే చేస్తారులే, నువ్వు అంత గట్టిగా అరవకు" అంటూ శశికళ భర్త రాంబాబు శశికళను ఊరుకోమన్నాడు.

"అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయావ్? విన్నావా మీ నాన్న రాసిన వీలునామా?" అంటూ చంద్రకళ తన భర్త లక్ష్మణ్ మీద అరిచింది.

"పల్లిపాలెం కాలువ వారే ఉన్న అయిదెకరాల పొలం ఎవరికి రాసారు?" అని పెద్ద కోడలు సూర్యకళ అడిగింది.

"ఇంకెవరికీ రాస్తారు? అది ముద్దుల కోడలు చంద్రకళకే రాసి ఉంటాడు" అని కూతురు శశికళ అంది.

"అది సరేగానీ లాయర్ గారు మరి మా వదినె సూరమ్మ గారి గురించి ఏం రాసినట్టు?" అని చంటి బాబాయ్ అడిగేసరికి "వస్తున్నా, అక్కడికే వస్తున్నా, సూరమ్మ గారు తన జీవితకాలం ఎవరి దగ్గర ఉంటారో వారికి ఈ మండువా లోగిలి ఇళ్ళు, కొత్తపల్లి కాలవ వైపు వున్న పదెకరాల పొలం సూరమ్మ గారి తదనంతరం వారికి చెందుతుందని రాసారు చంద్రయ్య గారు. అదండీ సంగతి. ఇంక నా పని పూర్తి అయినది. మీరందరూ బాగా ఆలోచించుకున్నాక, పది పదిహేను రోజుల పోయాక నాకు కబురు చేయండి.. నేను వచ్చి మీకు ఈ కాగితాలన్నీ ఇస్తాను" అంటూ లాయర్ విశ్వనాథం గారు లేచి బయలుదేరారు.

ఆయనతో పాటు వూరి పెద్ద మనుషులు కూడా వెళ్ళారు.

"ఏరా అబ్బాయ్ మీ అందరికీ మీ నాన్న సమ న్యాయం చేసాడురా. మరి మీ అమ్మను ఎవరు చూస్తారురా?" అని చంటి బాబాయ్ అడగ్గానే ఎవరు ఏమి మాట్లాడలేదు.

"ఏరా రాముడూ! నువ్వు పెద్దాడివి కదా, మీ అమ్మను నువ్వు చూడాలిరా" అన్నాడు.

"మా వల్ల కాదు. ఆయన వ్యాపార నిమిత్తం అస్తమానూ బయటే తిరుగుతుంటారు. ఆవిడకు ఏదైనా తేడా చేస్తే మేం ఉండే గోపవరంలో వైద్యం చేయించే దిక్కు ఉండదు" అని పెద్ద కొడుకు రాముడు భార్య సూర్యకళ చెప్పింది.

"ఏరా లచ్చుడూ, మరి నువ్వు ఏమంటావురా?" అని అడగ్గానే "మేం ఇద్దరం పొద్దున్న పోయి ఏ రాత్రికో ఇంటికి వస్తాము. అంతవరకూ ఒక్కావిడకు మా ఫ్లాట్‌లో ఏం తోస్తుంది? అయినా ఈ ఊరిలో సొంత ఇంటిలో ఆవిడ స్వేచ్ఛగా ఉన్నట్లు మా అపార్ట్‌మెంట్‌లో ఉండలేదు ఆవిడ" అని రెండో కోడలు చంద్రకళ నవ్వుతూ చెప్పింది.

"ఏమ్మా శశికళా! నీ సంగతి ఏమిటి మరి?" అని అడగ్గానే–

"నేనేం చేసినా మా ఆయన కాదనడు. ఇప్పుడు అమ్మను నేను చూసాననుకోండి ఆస్తి కోసమే ఇదంతా చేసిందంటూ అందరూ నన్నాడిపోసుకుంటారు. అసలే మాట్లాడడం చేతకానిదాన్నని నన్ను మా ఆయన అంటూ ఉంటాడు" అంటూ కూతురు శశికళ చెప్పింది.

"సరే మీరందరూ మీ ఆలోచనలు చెప్పారు కదా! అసలు మీ అమ్మనే అడుగుదాం ఆవిడ ఏమంటుందో?" అని, "ఏమ్మా వదిన గారూ! మీరేమంటారు?" అని చంటి బాబాయ్ అడిగాడు.

"సంతోషం నాయనా! ఇప్పటికైనా నేనో మనిషినని గుర్తించి, నన్ను అడిగావు.



నాకు ఓపిక వున్నంత కాలం నేను ఇక్కడే ఈ ఇంటిలోనే వుంటాను. ఎవరింటికీ అతిథిగా వెళ్లను. ఇల్లు, పొలం సంగతి తర్వాత చూద్దాం" అని సూరమ్మ గారు చెప్పింది.

"అమ్మయ్య.. ఇంతటితో ఈ గొడవ తీరింది. అత్తగారు ఎవరింటికి రారు ఇక్కడే వుంటారు. ఈ ఇల్లు, ఆ పొలం మీద ఎవరికి ఆశ వుంటే వాళ్ళు అత్తగారిని చూడొచ్చు" అంటూ పెద్ద కోడలు సూర్యకళ అంది.

"సరేరా మరి నేను వెళ్తున్నాను. రేయ్ నాదో చిన్నమాట వినండిరా మీరిద్దరూ రామలక్ష్మణుల్లా కలిసిమెలిసి ఉండే అన్నదమ్ములురా. పెళ్ళాలొచ్చాక మీరు కొద్దిగా దూరమయ్యారనిపిస్తోంది. ఇప్పుడు మీ నాన్న మీ అమ్మను ఒంటరి చేసి వెళ్ళిపోయాడు. మీరు కూడా ఆవిడని ఒంటరిని చేయకండిరా. ఆలోచించండిరా" అని చంటి బాబాయ్ వెళ్ళాడు.

"ఆయనకేం? ఎన్నైనా చెప్తాడు. మోసేవాడికే తెలుస్తుంది కష్టం" అని చంద్రకళ అనగానే "నువ్వూరుకోవే చంద్రా! అమ్మ వింటే బాధపడుతుంది" అని లక్ష్మణ అన్నాడు.

"ఆవిడ బాధపడుతుందని ఆవిడని భుజాల మీద ఎక్కించుకుని ఊరేగమంటారా? నాకు అంత సరదా లేదు. మీకుంటే మీరు ఊరేగండి" అంటూ రుసరుసలాడుతూ చంద్రకళ లోపలికి పోయింది.

"నా గురించి మీరెవ్వరూ గొడవలు పడక్కర్లేదు నేను ఎవరింటికి రాను. నా బొందిలో ప్రాణం వున్నంత కాలం ఇక్కడే వుంటాను. ఇక్కడే గుటుక్కుమంటాను. ఇక్కడే మట్టిలో కలుస్తాను" అని సూరమ్మ అన్నది.

"మరి ఇల్లు, పొలం ఎవరికిస్తావే అమ్మా? అసలే మాట్లాడడం తెలియనిదాన్ని" అంటూ కూతురు శశికళ అడిగేసరికి "దారే పోయె దానయ్యకు ఇస్తాను, లేదంటే ఏ సత్రానికో, గుడికో రాస్తాను. మీకందరికీ మీ నాన్న రాసిచ్చినవి తీసుకొని, ఆయన దిన కార్యక్రమాలు ఏ లోటూ రాకుండా చేయండి" అంటూ సూరమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

ఇది జరిగిన రెండో రోజు రాత్రి "ఏరా అన్నయ్యా! ఏం చేద్దాం అమ్మ సంగతి. రేపు నాన్న దిన కార్యక్రమాలు పూర్తి అవుతాయి. చుట్టాలు, బంధువులు అందరూ వెళ్ళిపోతారు. మనం కూడా ఊరెళ్ళాలి కదా!" అని తమ్ముడు అడిగాడు.

"ఏం చేయాలో తోచడం లేదు. అమ్మను మా ఇంటికి తీసుకెళ్ళడం కన్నా మీ ఊరు తీసుకెళ్ళితేనే బాగుంటుంది నువ్వు ఒకసారి మీ ఆవిడతో మాట్లాడి చూడరా" అని రాము అనేసరికి–

"అమ్మో! అది ఒకసారి వద్దు అందంటే దానిని ఒప్పించడం బ్రహ్మ తరం కూడా కాదు. నువ్వే వదినెతో మాట్లాడు" అని లక్ష్మణ అన్నాడు."ఇంకా నయం అమ్మ మాట ఎత్తితే నన్ను కూడా గెంటేసేలా వుంది" అని అన్న అన్నాడు.

"మరి అమ్మ సంగతి ఏం చేద్దాం? పోనీ బావనడుగుదామా?" అని లక్ష్మణ్ అంటూంటే అప్పుడే అటుకేసి వస్తూ రాంబాబు "ఏంటి బావలిద్దరూ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.? మీ అమ్మ గురించేనా? మీ అమ్మను నేను తీసుకెళ్తాను. ఆవిడ తదనంతరం కాకుండా ఇప్పుడే ఇల్లు, పొలం నా పేరు మీద రాసేయమనండి" అని నవ్వుతూ రాంబాబు అన్నాడు.

"ఓరి నీ ఆశ పిల్లులెత్తుకుపోను. ఎంత మాట అనేసావు రాంబాబు. ఇప్పుడే రాసేయమంటే అమ్మ బాధపడుతుంది కదా!" అని రాముడు అనేటప్పటికీ "నిజమే బాధపడుతుంది. ఆవిడకు చచ్చేంతవరకూ మేం సేవ చేయాలా? రాయకుండానే ఏ రోగమో వచ్చి చస్తేనూ, లేకపోతే ఆవిడ తనకు ఇష్టమైనవాళ్ళకు ఇల్లు, పొలం రాసేస్తే మా గతేం కావాలి బావా? ఆలోచించు" అని రాంబాబు అనగానే– "బావవైపోయావు కాబట్టి బతికిపోయావు, ఇంకొకడైతేనా ఈపాటికి బుర్ర రెండు ముక్కలు చేసేద్దును. మా అమ్మను అంత మాట అంటావా?" అంటూ లక్ష్మణ్ రాంబాబు మీదకు చేయెత్తాడు. "ఓయబ్బో! చాలా కోపం వచ్చిందే. అంత ప్రేమ ఉంటే మీ అమ్మను మీరే తీసుకెళ్ళి చూడొచ్చు కదా" అంటూ రాంబాబు రుస రుసలాడుతూ వెళ్ళాడు.

"నా గురించి మీరెవ్వరూ గొడవలు పడక్కర్లేదు, నేను ఎవరింటికి రాను. నా బొందిలో ప్రాణం వున్నంత కాలం ఇక్కడే వుంటాను. ఇక్కడే గుటుక్కుమంటాను. ఇక్కడే మట్టిలో కలుస్తాను" అని సూరమ్మ అన్నది.

"రేయ్ లక్ష్మణా! ఒక పని చేద్దాం, అమ్మను వృద్ధాశ్రమంలో చేర్పుదాం. అక్కడైతే సుఖంగా ఉంటుంది. మనకి ఏ ఇబ్బందీ ఉండదు" అని అన్న చెప్పగానే "మరి డబ్బులు ఎవరు కట్టాలి?" అని తమ్ముడు అడిగాడు.

"ఒక నెల నువ్వు, ఇంకో నెల నేను కడదాం" అని చెబ్తుండగా తోడికోడళ్ళు ఇద్దరూ వచ్చి "ఈ ఆలోచన బాగుంది. డబ్బులు మనమే కడతాం కాబట్టి ఇల్లు ఒకరు, పొలం ఒకరు రాయించుకుందాం" అని చంద్రకళ అంది.

"ఎంతకాలం కట్టాలి?" అని సూర్యకళ అడిగింది. "ఎంతకాలమేంటే? ఆవిడ ఎంతోకాలం బతకదు. బహుశా అయిదారు నెలల్లో ఆవిడ పోవచ్చు. అంతవరకూ కడితే సరిపోతుంది" అని చద్రకళ చెప్పగానే "బాబోయ్ అయిదారు నెలలే, నెలకి ఓ పాతికవేలు కట్టాలి కదా, చాలా అయిపోతుంది కదా! అని సూర్య కళ కంగారుగా అనేసరికి–

"ఏమిటిరా అన్నయ్యలూ! ఇక్కడ కబుర్లు, నాకు చెప్పకుండా "అంటూ వచ్చింది శశికళ "ఆ ఏమీ లేదు శశీ! మీ అమ్మను అనాథాశ్రమంలో చేర్పిద్దామని అనుకుంటున్నారు. మీ అన్నయ్యలు" అని చంద్రకళ చెప్పింది.

"అయితే ఇప్పుడు ఈ ఇల్లు, ఆ పొలం కూడా రాయించేసుకుంటారా? మరి నాకేమీ ఇవ్వరా?" అని శశికళ కంగారుగా అడిగేసింది. "ఓయ్ శశీ కాసేపు నోర్మూసుకో, ఇప్పుడవేమీ లేవు. రేపు నాన్న గారి దిన కార్యక్రమాలు అయినాక, అమ్మని అనాథాశ్రమంలో చేర్చాక అప్పుడు చూద్దాం సరేనా?" అని పెద్దోడు రాము చెప్పాడు.

"రేయ్ అన్నయ్యలూ ! నన్ను వదిలేయకండిరా అసలే మాట్లాడడం చేతకానిదాన్నిరా" అని చెల్లెలు శశికళ అంది.

"సరే, సరే నీకు ఏదో కొద్దిగా ఇస్తాములే, అంతవరకూ ఈ విషయం ఎవరికీ చెప్పకు" అని చంద్రకళ అంది.

"ఏ విషయం వదినా?" అని శశికళ అడిగింది. "అదేనే శశీ! మీ అమ్మను అనాథాశ్రమంలో చేర్చుతున్నట్లు, ముఖ్యంగా మీ చంటి బాబాయ్‌కి అస్సలు తెలియకూడదు తెలిసిందా? శశీ" అని సూర్య కళ చెప్పగానే "సరేనమ్మా వదినెమ్మా! చెప్పనులే" అని శశికళ అన్నది.

"సరే, పదండి, రేపంటి పనులు చూద్దాం పదండి" అంటూ

అందరూ లేచి వెళ్ళారు.

మర్నాడు చంద్రయ్య దిన కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. చుట్టాలు, బంధువులు, వచ్చిన వారందరూ వెళ్ళిపోయారు. "అమ్మా ఒకసారి ఇలారా!" అంటూ పెద్దకొడుకు రాముడు అమ్మను తీసుకొచ్చి ప్రేమగా భుజం మీద చెయ్యి వేసి "అమ్మా! మేమందరం నీ గురించి బాగా ఆలోచించి, ఓ నిర్ణయానికి వచ్చాం. నాన్నగారు నిన్ను ఒంటరిని చేసి, వెళ్ళిపోయారు. నువ్వు ఒక్కదానివి ఇక్కడ బాధలు పడుతూ వుండాలి. నువ్వు ఎలా ఉన్నావో? అని మేం అక్కడ బాధపడాలి. నువ్వు బాధ పడుతుంటే మా పనులు మేం చక్కగా చేసుకోలేం" అని చెబుతోంటే "ఇంతకీ ఏమంటావురా రాముడూ?" అని చంటి బాబాయ్ అడిగేసాడు.

**"లక్ష్మణా నువ్వు చెప్పరా" అన్నాడు రాముడు. "నువ్వు పెద్దాడివి కదా! నీ మాట నేనెప్పుడూ కాదన్నాను, అన్నయ్యా ! నువ్వే చెప్పరా అన్నయ్యా" అని అన్నాడు, తమ్ముడు.**

"లక్ష్మణా, నువ్వు చెప్పరా" అన్నాడు రాముడు. "నువ్వు పెద్దాడివి కదా! నీ మాట నేనెప్పుడూ కాదన్నాను, అన్నయ్యా ! నువ్వే చెప్పరా అన్నయ్యా" అని తమ్ముడు అనేసరికి "ముందు ఆ ఎదవ నసుగుడు ఆపి, అసలు విషయం చెప్పండి" అని చంటి బాబాయ్ కసురుకున్నాడు. "ఏంటి? మీలో మీరు తెగ బాధపడిపోతున్నారు. నేను చెబుతా వినండి మావయ్య గారు, వాళ్ళ అమ్మని అనాథాశ్రమంలో చేర్పిస్తారు. ఈరోజే ప్రయాణం. అన్ని ఏర్పాట్లు చేసారుట. వాళ్ళు అమ్మ మీద ప్రేమతో ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక రాత్రంతా తెగ బెంగెట్టుకొని సరిగా తిండి తినలేదు పాపం" అని చంద్రకళ చెప్పింది.

"నిజమే అక్కా! మా ఆయన రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాడు. నిద్ర కూడా పోలేదు. వాళ్ళ అమ్మ మీద ప్రేమ అలాంటిది" అని సూర్యకళ చెప్పగానే "ఛా, ఛా నోర్ముయ్యండిరా! మీ పిచ్చి మాటలు మీరునూ, మీ బెంగంతా మీ అమ్మ మీదనా? లేదంటే ఆస్తి మీదనా? ఎవరికి చెబుతారురా కబుర్లు. ఆవిడను అనాథాశ్రమంలో చేర్పించేస్తారా? అంతా మీ ఇష్టమేనా? ఆవిడ కూడా మనిషే. ఆవిడకు ఓ మనసు, ఓ వ్యక్తిత్వం, ఓ అభిమానం అన్నీ ఉన్నాయని మరచిపోయార్రా మీరు? ఆవిడ ఇష్టా ఇష్టాలతో పని లేదేంటిరా మీకు?" అని చంటి బాబాయ్ కేకలు పెట్టేసరికి పెద్ద కొడుకు రాముడు "అమ్మ మీద ప్రేమ ఉంది కాబట్టే, అనాథాశ్రమంలో చేర్పిద్దామని" మాట పూర్తి కాకుండానే "ఇంకోసారి ఆమాట అన్నావంటే నోట్లోంచి మాటలు రాకుండా మూతి పళ్ళు రాలకొడతా" అన్నాడు, చంటి బాబాయ్.

అందరూ మౌనంగా ఉండిపోయారు ఓ క్షణం. "మరి ఏం చేద్దాం? బాబాయ్ అమ్మ విషయం నువ్వే చెప్పు" అంటూ రెండో కొడుకు అడిగాడు. "నన్ను కాదు అడగాల్సింది. మీ అమ్మనడగండిరా పెళ్ళాలకు భయపడే చవటల్లారా!" అని చంటి బాబాయ్ అనగానే "ఏంటండీ ఊరుకుంటుంటే చాలా ఎక్కువ మాట్లాడుతున్నారు. ఇది మా ఇంటి సంగతి, మేం చూసుకుంటాం, అని చంద్రకళ అంది.

"ఆడదాన్ని కొట్టానని నన్ను బాధపడేలా చేయకు, నోరు మూసుకొని కూర్చో చచ్చిన మొగుడి మీద బెంగతో ఓ అయిదారు నెలల్లో ఈవిడా చస్తుంది. అప్పుడు ఆస్తి వేసుకోవచ్చంటూ, గోతికాడ నక్కలా కాసుకొని కూర్చున్నావ్, నువ్వు ముందు నోర్ముయ్యి" అని చంద్రకళను గసిరాడు బాబాయ్.

"అమ్మా వదినెమ్మా! ఇప్పుడు మీరు మాట్లాడే సమయం వచ్చింది. చెప్పండమ్మా మీ అభిప్రాయం" అని బాబాయ్ అన్నాడు.

"చంటీ! ముందు వాళ్ళందరినీ ఇక్కడి నుంచి వెళ్ళిపొమ్మను. ఆయనతో పాటే నేను చచ్చాను అని చెప్పు, నన్నెవరూ చూడక్కరలేదని చెప్పు. నేనిక్కడే వుంటాను. నేనిక్కడే కన్నుమూస్తాను. నేనిక్కడి మట్టిలో కలుస్తాను అని చెప్పు" అని సుందరమ్మ గట్టిగా చెప్పింది. "మరి నువ్వు ఒంటరిగా ఇక్కడ" అని పెద్దకొడుకు రాముడు అంటూండగానే ఆవిడ "ఏమీ ఒంటరి కాదు, ఆవిడకు మేమంతా తోడుగా ఉంటాం" అంటూ రాజు, సుందరం, సూరి, కమల మొదలైన వారు ఓ పదిమంది వచ్చారు.

వాళ్ళందరినీ చూడగానే కొడుకులిద్దరికీ పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్లైంది. కోడళ్ళు వీళ్ళు ఎవరా? అని సందేహంగా, సుందరమ్మ గారు, చంటి బాబాయ్ ఆనందంగా చూస్తుండగా "రేయ్ రాజూ! ఇది మా ఇంటి వ్యవహారం మీరు కలగజేసుకోవద్దు" అని రాము అన్నాడు.

"ఏంటిరా మీ ఇంటి వ్యవహారం అమ్మ గారిని అనాథాశ్రమంలో చేర్పించటం మీ ఇంటి వ్యవహారమా? అయినా మేం ఇంతమంది ఉండగా అమ్మ ఒంటరిదెలా అవుతుంది? అమ్మ ఇక్కడే వుంటారు. ఆమెకు తోడుగా మేమందరం కంటికి రెప్పలా కాచుకుంటాము" అని రాజు అన్నాడు. "అసలు మీకేంటి సంబంధం? మా అత్తను చూడటానికి? మీరేమైనా చుట్టాలా?" అని చంద్రకళ "మరేనమ్మా ఈవిడ గారి ఆస్తిని కొట్టేయడానికి, వీళ్ళు ఎవరో బానే ప్లాన్ చేసారే అక్కా" అంటూ సూర్యకళ అనేసరికి "ఛీ, ఛీ, ముందు మీరు ఇక్కడినుంచి బయటకి పొండి. ఇంకొక్క క్షణం నా కళ్ళముందు ఉంటే ఏం చేస్తానో నాకే తెలియదు" అని కోపంగా సూరమ్మ గారు అరుస్తుంటే "అమ్మా! ఊరుకోండమ్మా! వాళ్ళకోసం మీరు ఇంతవరకూ ఆరోగ్యం పాడుచేసుకున్నది చాలు, ఇప్పుడు వాళ్ళమీద అరిచి ఇంకా మీ ఆరోగ్యం పాడుచేసుకోవద్దు" అంటూ కమల, సూరి, సుందరం అమ్మను పట్టుకొని కూర్చోబెట్టారు.

"రేయ్ రామూ, లక్ష్మణా! ఇప్పుడు చెబుతున్నాం వినండి చంద్రయ్య గారు మీకు నాన్న మాత్రమే, మాకు గురువు, దైవం, బలం, మా ఎదుగుదలకు పునాది, మా వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దిన ఆచార్యదేవుడు, వారు పెట్టిన భిక్షే ఈ రోజున సమాజంలో ఇంత పేరు ప్రఖ్యాతులు.

"మాస్టారు చనిపోయినట్టు మీరు మాకు కబురు చేయొద్దన్నారు, కానీ అమ్మ గారు మాకు ఇక్కడ జరుగుతున్న ప్రతీ విషయం ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. మీ అమ్మను మీరు చూడడానికి వాటాలేసుకోవడం, ఆవిడ ఆస్తిని కాజేయటానికి మీరు చేస్తున్న పనులు అన్నీ మాకు తెలుసు. అందుకనే మేమంతా ఓ నిర్ణయానికి వచ్చాం.. ఇప్పుడు చెబుతున్నాం వినండి బాబాయ్ గారూ! చంద్రయ్య మాస్టారు మాకు చదువుతో పాటు సంస్కారం నేర్పారు. మంచితనంతో పాటు మానవత్వం నేర్పారు. జాలి పడడంతో పాటు సాయం చేయడం నేర్పారు. అందుకని ఆ మహనీయుని స్మారకార్థం ఈ ఇంటినే అనాథాశ్రమంగా మార్చి అమ్మను ట్రస్టీగా పెట్టి చంటి బాబాయ్‌ను ప్రెసిడెంట్‌గా పెడుతున్నాం" అని రాజు చెప్పాడు.

"అదెలా కుదురుతుంది? మా ఇష్టం లేకుండా. మా అమ్మను మాలో ఎవరో ఒకరు చూసుకుంటాం" అని రాముడు అనగానే

(మిగతా 25వ పేజీలో..)

# స్మార్ట్‌ఫోన్ చేతిలో... బాల్యం ప్రమాదంలో!

**సాంకేతిక విప్లవం మానవ జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. ప్రపంచంలోని ఏ మూలన ఉన్న సమాచారమైనా క్షణాల్లో మన చేతిలోకి వస్తోంది. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి, కమ్యూనికేషన్... ఇలా దాదాపు ప్రతి రంగంలో డిజిటల్ సాంకేతికత మన జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది.**

స్మార్ట్‌ఫోన్ ఈ విప్లవానికి ప్రతీకగా మారింది. అయితే ఈ సౌకర్యం వెనుక ఒక తీవ్రమైన ఆందోళన కూడా దాగి ఉంది. ముఖ్యంగా పిల్లల చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ వారి భవిష్యత్తుకు వేదికగా మారుతుందా? లేక వారి బాల్యాన్ని మింగేస్తున్న మౌన ప్రమాదంగా మారుతుందా? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

పిల్లల సోషల్ మీడియా వినియోగంపై ప్రపంచంలోని అనేక దేశాలు అప్రమత్తం కావడం ఈ సమస్య తీవ్రతకు నిదర్శనం. ఆస్ట్రేలియా 16 యేళ్లలోపు పిల్లల సోషల్ మీడియా ఖాతాలపై కఠినమైన కనీస వయస్సు నిబంధనలను అమల్లోకి తెచ్చింది. బ్రిటన్‌లోనూ 16 యేళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేయాలనే ఆలోచన ప్రభుత్వ స్థాయిలో ముందుకు వచ్చింది.

పిల్లల ఆన్‌లైన్ భద్రతను కేవలం కుటుంబ సమస్యగా కాకుండా సామాజిక, ప్రజా విధాన సమస్యగా చూడాల్సిన అవసరం ఏర్పడిందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## సౌకర్యం నుంచి వ్యసనం వరకు...

సోషల్ మీడియా వేదికలు మొదట్లో ప్రజలను అనుసంధానం చేయడానికి, సమాచారాన్ని పంచుకోవడానికి, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి రూపొందించబడ్డాయి. కానీ కాలక్రమేణా అవి మనిషి దృష్టిని ఎక్కువసేపు తమవైపు నిలుపుకునే విధంగా అభివృద్ధి చెందాయి. పిల్లల విషయంలో ఈ ప్రభావం మరింత తీవ్రమవుతోంది.

ఒక వీడియో తర్వాత మరొక వీడియో... ఒక పోస్టు తర్వాత మరో పోస్టు... అంతులేని స్క్రోలింగ్... తెలియకుండానే గంటలు గడిచిపోతున్నాయి. ఒకప్పుడు పిల్లలు మైదానంలో పరుగులు పెట్టేవారు. ఇప్పుడు అదే సమయం మొబైల్ స్క్రీన్ ముందు గడుస్తోంది. ఒకప్పుడు స్నేహితులతో మాట్లాడేవారు. ఇప్పుడు చాటింగ్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఒకప్పుడు పుస్తకాలు చదివేవారు. ఇప్పుడు చిన్నచిన్న వీడియోలే వారి దృష్టిని ఆక్రమిస్తున్నాయి.

**స్మార్ట్‌ఫోన్ ఉండటం సమస్య కాదు. స్మార్ట్‌ఫోన్ పిల్లల జీవితాన్ని నియంత్రించడం సమస్య.**

అధిక స్క్రీన్ సమయం వల్ల చదువుపై దృష్టి తగ్గడం, శారీరక కదలికలు తగ్గిపోవడం, నిద్రకు ఆటంకం కలగడం, కుటుంబ సభ్యులతో ముఖాముఖి సంభాషణ తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. బాల్యం అంటే శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ వికాసానికి అత్యంత కీలకమైన దశ. ఆ దశలో ఏర్పడే అలవాట్లు భవిష్యత్ వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతాయి.



## 'లైక్' కోసం ఆరాటం!

సోషల్ మీడియా ప్రమాదం కేవలం సమయాన్ని వృథా చేయడంలోనే లేదు. పిల్లల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయడంలోనూ ఉంది.

"ఎన్ని లైక్స్ వచ్చాయి?" "ఎంతమంది ఫాలో అవుతున్నారు?", "నా వీడియోకు ఎన్ని వ్యూస్ వచ్చాయి?" అనే ప్రశ్నలు కొంతమంది పిల్లల దైనందిన ఆలోచనల్లో భాగమవుతున్నాయి. ఇతరుల ఫొటోలు, జీవనశైలి, విజయాలు, రూపురేఖలతో తమను తాము పోల్చుకోవడం వల్ల అసంతృప్తి పెరగవచ్చు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలు, సైబర్ బులీయింగ్, అవమానకరమైన పోస్టులు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. అసత్య సమాచారం, అసభ్యకర కంటెంట్, హింసాత్మక దృశ్యాలు, మోసపూరిత ప్రకటనలు, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు వంటి ప్రమాదాలు కూడా చిన్నారులను వెంటాడుతున్నాయి. వయస్సుకు తగని కంటెంట్‌ను పిల్లలు సులభంగా చూడగలిగే పరిస్థితి ఏర్పడటం మరింత ఆందోళన కలిగించే అంశం.

## నిషేధమే పరిష్కారమా?

ఇక్కడే అసలు చర్చ మొదలవుతుంది. పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా నిషేధించాలా? లేక నియంత్రిత వినియోగానికి అవకాశం కల్పించాలా?

పూర్తి నిషేధం ఒక్కటే పరిష్కారం కాకపోవచ్చు. డిజిటల్ ప్రపంచం నుంచి పిల్లలను పూర్తిగా దూరం చేయడం సాధ్యం కాదు. భవిష్యత్తులో విద్య, ఉపాధి, సమాచార ప్రాప్తి, సాంకేతిక పరిజ్ఞానం వంటి ప్రతి రంగంలో డిజిటల్ నైపుణ్యం అవసరమే. కాబట్టి లక్ష్యం టెక్నాలజీని పిల్లల నుంచి దూరం చేయడం కాకుండా, టెక్నాలజీ పిల్లలను నియంత్రించకుండా పిల్లలే టెక్నాలజీని నియంత్రించే సామర్థ్యాన్ని కల్పించడం కావాలి. అయితే చిన్న వయస్సులో సోషల్ మీడియా వినియోగానికి కనీస వయస్సు,

తల్లిదండ్రుల పర్యవేక్షణ, వయస్సు నిర్ధారణ, ప్రమాదకర కంటెంట్ నియంత్రణ వంటి రక్షణ చర్యలు అవసరం. పిల్లల ప్రయోజనాల విషయంలో సోషల్ మీడియా సంస్థలపై కూడా బాధ్యత విధించాలి.

## ఏం చేయాలి?

ఈ చర్చ భారత్‌కు మరింత ముఖ్యమైనది. కోట్లాది మంది పిల్లలు, కౌమారదశ యువత స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్న దేశంలో పిల్లల డిజిటల్ భద్రతను నిర్లక్ష్యం చేయలేం. భారత్‌కు అవసరమైంది కేవలం ఒక నిషేధ చట్టం కాదు. సమగ్ర పిల్లల డిజిటల్ రక్షణ విధానం.

పిల్లల వయస్సు నిర్ధారణ, వ్యక్తిగత డేటా రక్షణ, సైబర్ బుల్లీయింగ్‌పై వేగవంతమైన చర్యలు, ప్రమాదకర కంటెంట్ నియంత్రణ, తల్లిదండ్రులకు మార్గదర్శకాలు, పాఠశాలల్లో డిజిటల్ అక్షరాస్య తఇవన్నీ ఒక సమగ్ర విధానంలో భాగం కావాలి. ముఖ్యంగా పిల్లలకు "ఇంటర్నెట్‌ను ఉపయోగించకూడదు" అని చెప్పడం కంటే "ఇంటర్నెట్‌ను ఎలా సురక్షితంగా ఉపయోగించాలి?" అనేది నేర్పడం అవసరం.

## తల్లిదండ్రుల బాధ్యత

పిల్లల చేతిలో ఫోన్ పెట్టి, ఆ తర్వాత వారి డిజిటల్ ప్రవర్తనపై పూర్తిగా బాధ్యతను ప్రభుత్వాలపై లేదా సోషల్ మీడియా సంస్థలపై నెట్టివేయడం సరికాదు. తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలు ఫోన్‌లో ఏమి చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏ కంటెంట్ వారిని ప్రభావితం చేస్తోంది? ఎంత సమయం ఆన్‌లైన్‌లో ఉంటున్నారు? వంటి విషయాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అయితే ఇది గూఢచర్యంలా కాకుండా స్నేహపూర్వక సంభాషణగా ఉండాలి. ఇంకో ముఖ్యమైన విషయం తల్లిదండ్రులే పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. ఇంట్లో పెద్దలు ఎప్పుడూ ఫోన్‌లో మునిగిపోయి ఉంటే, పిల్లలకు స్క్రీన్ టైమ్ గురించి చెప్పడం ఎంతవరకు ఫలిస్తుంది? పిల్లలకు డిజిటల్ క్రమశిక్షణ నేర్పాలంటే కుటుంబం మొత్తం దాన్ని పాటించాలి.



## పాఠశాలలు కూడా ముందుకు రావాలి

పాఠశాలలు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా కాకుండా డిజిటల్ ప్రపంచాన్ని అర్థం చేసుకునే వేదికలుగా కూడా మారాలి. సైబర్ భద్రత, వ్యక్తిగత సమాచార రక్షణ, నకిలీ వార్తలను గుర్తించడం, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం, ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవడం వంటి అంశాలను విద్యార్థులకు బోధించాలి.

అదే సమయంలో క్రీడలు, పుస్తక పఠనం, సంగీతం, కళలు, సామాజిక సేవ, ప్రకృతి అనుభవాలు వంటి కార్యకలాపాలకు పిల్లలను ప్రోత్సహించాలి. ఎందుకంటే బాల్యం అనేది కేవలం డిజిటల్ అనుభవాల సమాహారం కాదు.

## స్క్రీన్‌కు అవతల మరో ప్రపంచం ఉంది!

పిల్లలు మైదానంలో ఆడుకోవాలి. స్నేహితులతో నవ్వుకోవాలి. పుస్తకాలు చదవాలి. తల్లిదండ్రులతో మాట్లాడాలి. ప్రకృతిని ఆస్వాదించాలి. ఓటమిని ఎదుర్కోవాలి. విజయం సాధించినప్పుడు ఆనందాన్ని పంచుకోవాలి. సమాజంతో మమేకం కావాలి.

ఈ అనుభవాలే పిల్లల వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. సోషల్ మీడియా వాటికి ప్రత్యామ్నాయం కాదు. ఒక 'లైక్' నిజమైన స్నేహానికి ప్రత్యామ్నాయం కాదు. ఒక 'ఫాలోవర్' కుటుంబ అనుబంధానికి ప్రత్యామ్నాయం కాదు. వందలాది ఆన్‌లైన్ పరిచయాలు ఉన్నా, మనసు విప్పి మాట్లాడగల ఒక నిజమైన వ్యక్తి లేకపోతే ఆ సంబంధాల విలువ ఏమిటి?

## బాధ్యత ఎవరిది?

పిల్లల డిజిటల్ భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. కేవలం తల్లిదండ్రుల బాధ్యత కూడా కాదు. అది పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు, సోషల్ మీడియా సంస్థలు, సమాజం అందరి ఉమ్మడి బాధ్యత.

16 యేళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై పరిమితులు విధించాలా? అనే ప్రశ్నకు దేశానికో సమాధానం ఉండవచ్చు. కానీ ఒక విషయం మాత్రం సార్వత్రికం పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు.

సాంకేతికతను ఆపడం సాధ్యం కాదు. కానీ దాని దుష్ప్రభావాలను నియంత్రించడం మాత్రం సాధ్యమే. పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వకపోవడం కంటే, స్మార్ట్‌గా ఉపయోగించడం నేర్పడం ముఖ్యం. అదే సమయంలో చిన్నారులపై వ్యాపార ప్రయోజనాల కోసం సాంకేతికత దుర్వినియోగం కాకుండా ప్రభుత్వాలు స్పష్టమైన రక్షణ గోడలను నిర్మించాలి.

నేటి పిల్లలే రేపటి దేశ నిర్మాణ శిల్పులు. వారి చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ జ్ఞానానికి ద్వారం కావచ్చు... అదే సమయంలో బాల్యాన్ని బంధించే తెరగా కూడా మారవచ్చు. కాబట్టి ప్రశ్న స్మార్ట్‌ఫోన్ పిల్లల చేతిలో ఉండాలా? అన్నది కాదు. అది వారి చేతిలో ఉండి వారిని నడిపించాలా? లేక వారు దానిని నడిపించాలా? అన్నదే అసలు ప్రశ్న. పిల్లల బాల్యం స్క్రీన్‌లో బందీ కాకుండా, జీవితంలో వికసించాలి. ఎందుకంటే బాల్యం సురక్షితంగా ఉంటేనే భావితరం సురక్షితంగా ఉంటుంది.

– తిప్పర్తి శ్రీనివాస్

– బలం రహస్యం ఏకాగ్రతలో దాగి ఉంది.

– ఎమర్సన్

– ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురు చూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు. –జియోర్జ్ ఎలైట్

# వీడియో గేమ్స్ వరమా, శాపమా?

ఒక ఎలక్ట్రానిక్ దృశ్య, శ్రవణ ఉపకరణ ఇన్‌పుట్ కంట్రోలర్ల ద్వారా వినియోగదారులు ఆడుకునే ఆసక్తికర అత్యాధునిక క్రీడను 'వీడియో గేమ్' లేదా 'వీడియో గేమింగ్' అని పిలుస్తున్నాం. ఒక టివీ సెట్, కంప్యూటర్ మానిటర్, హ్యాండ్‌హెల్డ్ పరికర డిస్‌ప్లే, టచ్ స్క్రీన్ ఉపకరణాలు లాంటి వేదికలే క్రీడా మైదానాలుగా డిజిటల్ మానవుడు ఆడుతున్న ఆధునిక ఆటను వీడియో గేమ్‌గా నేటి యువత అబ్బురపడుతూ ఆడుతున్నది. వినోదం, విరామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం, సామాజిక అనుభవం, పోటీల కోసం యాక్షన్, అడ్వెంచర్, రోల్‌ప్లేయింగ్ గేమ్‌ల వంటి వీడియో గేమ్స్ ఆడడం జరుగుతున్నది. వీడియో గేమ్ ఆడే వ్యక్తిని 'గేమర్' అని అంటాం. 1940ల్లో వీడియో గేమ్ ఆవిష్కరణలకు పునాదులు పడుతూ 1970ల్లో వాణిజ్యపరంగా అందుబాటులో రావడం, 1980లో వీడియో గేమ్స్ సామాన్యులకు సహితం అందుబాటులోకి రావడంతో నేటి పౌర సమాజంతో విడదీయరాని సంబంధాలను సుస్థిరం చేసుకున్నది ఈ మోడ్రన్ డిజిటల్ క్రీడ.

చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్న అసంఖ్యాక వీడియో గేమింగ్ ప్రక్రియలు మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించడం జరిగింది. మైన్‌క్రాఫ్ట్, సూపర్ మారియో బ్రోస్, టెట్రిస్, ఫోర్ట్‌నైట్, ది లెజెండ్ ఆఫ్ జెల్డా లాంటి పలు ప్రఖ్యాత వీడియో గేమ్స్ నేడు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి.

వీడియో గేమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వీటి ప్రభావాలను వివరించడం, ఆవిష్కర్తలను గుర్తు చేసుకోవడం, వినోదంతో పాటు విశ్రాంతి/విరామాలకు దోహదపడడం, ఇతరులతో ఆన్‌లైన్‌లో కనెక్ట్ కావడం, టీమ్‌వర్క్‌ను పెంపొందించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం లాంటి అంశాలను సవివరంగా చర్చించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ పన్నెండో తేదీన ప్రపంచ దేశాలు 'జాతీయ వీడియో గేమ్స్ దినం' పాటించడం జరుగుతోంది. మన ముని వేళ్లతో అద్భుత ఆనందాల మైదానంలో విహరింపజేస్తున్న వీడియో గేమింగ్ రోజురోజుకు కటింగ్‌ఎడ్జ్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతున్నది. వీడియో గేమింగ్ డిజిటల్ క్రీడలతో పలు ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో నష్టాలను కూడా నమోదు చేస్తున్నాయి.



## వీడియో గేమింగ్ టెక్నాలజీ వరమా, శాపమా!

వీడియో గేమింగ్ వల్ల పలు వరాల లాంటి ప్రయోజనాలు కలుగుతున్నప్పటికీ హద్దులు మీరి మునిగితే పలు అనర్థాలు లేదా శాపాలను కూడా మూటకట్టుకోవలసి ఉంటుంది. వీడియో గేమ్స్ వల్ల వేగంగా స్పందించడం, కమ్యూనికేషన్ ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెరగడం, చిన్న చిన్న విషయాలకు సహితం స్పందించడం, నాయకత్వ లక్షణాలు/జ్ఞాపకశక్తి పెరగడం, శ్రేయస్సుకు దోహదపడడం, సామాజిక బంధాలు బలపడడం, కొత్త భాషలు నేర్చుకోవడం, క్రిటికల్ థింకింగ్/ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెరగడం, ఏకాగ్రత పెరగడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు గంటల కొద్ది వీడియో గేమ్స్ ఆడిన వారిలో శారీరక హాని, సామాజిక ఒంటరితనం, శారీరక అనారోగ్యం, మానసిక సమస్యలు, ప్రవర్తనలో మార్పులు, ఆందోళన అనవసర ఆవేశం పెరగడం, కంటి జబ్బులు, హద్దుమీరితే దురవాటుగా మారి పిల్లలు, యువత ఉజ్వల భవిష్యత్తుకు అడ్డుపడుతుంది.

డిజిటల్/ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ వీడియో గేమ్స్‌ను పరిమిత సమయం ఆడితే ఆనందంతో పాటు మానసిక ఉపశమనం కలుగుతాయి. రోజుకు 30 నిమిషాల కన్న ఎక్కువ సమయం ఆడడం మంచిది కాదు. పిల్లలు, యువత వీడియో గేమింగ్ టెక్నాలజీకి వ్యసనపరులు కాకుండా తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి, ఏ గేమ్ ఆడుతున్నారు, ఎంతసేపు ఆడుతున్నారు అనే విషయాలను నిత్యం తెలుసుకుంటూ ఉండాలి. ఆధునిక టెక్నాలజీని మన ఆరోగ్యకర జీవనశైలిని బలపరిచే విధంగా వాడుతూ ఉండాలి. ప్రతి రోజు మైదాన క్రీడలకు లేదా వ్యాయామ క్రీడలకు, పాఠశాల హోమ్‌వర్క్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరిచి పోరాదు. ఏదైనా అతిగా వాడితే అనర్థమే అని తెలుసుకొని అన్ని రకాల ప్రక్రియలకు పరిమితసమయాలను కేటాయించుకుంటూ డిజిటల్/ఏఐ నరుడిగా ముందుకు సాగాలి. టెక్నాలజీని మానసిక శారీరక ఆరోగ్యానికి అవసరం మేరకు వాడుకుంటూ స్మార్ట్ నరుడిగా రుజువు చేసుకోవాలి.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

> – ఆడంబరాలకు పోవద్దు, ఉన్నవాటిని పోగొట్టుకొని లేనివాడిగా మారవద్దు.
>
> – ఆలోచన లేని అభ్యసనం నిరుపయోగం; అభ్యసనం లేని ఆలోచన ప్రమాదకరం.
>
> – ఆలోచన లేనివారికి కనిపించేది అంధకారమే!
>
> – అరకొర పాండిత్యం ప్రమాదకరం.

# మనోహర దృశ్య కావ్యం 'జోగ్' జలపాతం

కర్ణాటకలోని జోగ్ జలపాతం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ సహజ అద్భుతాలలో ఒకటి. ఇది శివమొగ్గ జిల్లాలోని సాగర తాలూకాలో, పశ్చిమ కనుమల మధ్య ప్రవహించే శరావతి నదిపై ఏర్పడింది. శరావతి నది ఇక్కడ సుమారు 830 అడుగుల లోతైన లోయలోకి ఒక్కసారిగా పడుతూ జోగ్ జలపాతం అతి సుందరంగా కనిపిస్తుంది. స్థానిక భాష అయిన కన్నడలో 'జోగ' అంటే 'జాలువారడం' లేదా 'పడటం' అని అర్థం.



## జోగ్ జలపాతం చరిత్ర

ప్రకృతి మన కందించిన ఎన్నో సుందరమైన ప్రాంతాలు మానవుడి మితిమీరిన సంపద కాంక్ష వల్ల, పెరిగిపోతున్న కాలుష్యం వల్ల కనుమరుగైపోతోంది. అటువంటి సందర్భాలలో కొన్ని పర్యాటక ప్రాంతాలు రొటీన్ జీవితం నుంచి మనకెంతో రిలీఫ్‌నిస్తాయి. ఆధునికత పెరిగిపోయిన ఈ రోజుల్లో ఎలాంటి చిన్న అవకాశం వచ్చినా ఇలాంటి ప్రాంతాల్ని సందర్శించాలనుకుంటున్నారు. జనం జోగ్ జలపాతానికి జోగ, జోగద గుండి, గెరుసొప్ప జలపాతం వంటి పేర్లు కూడా ఉన్నాయి.

శరావతి నది పశ్చిమ దిశగా ప్రవహిస్తూ ఈ ప్రాంతంలో భారీ రాతి లోయను చేరిన జోగ్ జలపాతం కేవలం ఒక్క ధారగా కాకుండా, కొండ అంచు నుంచి నాలుగు వేరువేరు పాయలుగా విడిపోయి కిందికి పడుతుంది. ఈ నాలుగు జలధారలకు రాజా, రాణి, రోరర్, రాకెట్ అనే పేర్లు ఉన్నాయి.

## మనోహర దృశ్యం

మనసుని పులకరింపచేసే మనోహర దృశ్య కావ్యం జోగ్ జలపాతం. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ జిల్లాలో నెలకొని వున్న జోగ్ జలపాతం 830 అడుగుల ఎత్తు నుండి రాజా, రాణి, రోరర్, రాకెట్ పేర్లతో నాలుగు పాయలుగా శరావతి కొండలపై నుండి జాలువారుతుండే ఆ మనోహర దృశ్యాన్ని తిలకించడానికి రెండు కళ్లు చాలవు.

భారతదేశంలోని ఎత్తైన జలపాతాల్లో ఒకటైన ఈ జలపాతాన్ని 'గెరిసొప్పా' జలపాతం అని కూడా పిలుస్తారు. ప్రతి ఏడాది ఆగస్టు నుండి నవంబరు మధ్య వర్షాకాలంలో దీని అందాలు చూడడం పర్యాటకులకు ఎంతో ఆనందాన్నిస్తుంది. చాలా ఎత్తు నుండి నీరు కిందకు దుముకుతుంటే సందర్శకులంతా ఆనందోత్సాహాలతో తిలకిస్తారు. రాజా జలపాతం నిర్మలంగా, సౌమ్యంగా ఉన్న రాజులాగా ఉండటంవల్ల జోగ్ జలపాతంలోని ఈ పాయకు 'రాజా' అని పేరు పెట్టారు. అత్యంత ఎత్తు నుంచి దాదాపు ఒకే ధారగా నేరుగా కిందికి పడుతుంది. ఇది అత్యంత ఎత్తైన, నిరంతరంగా ప్రవహించే ప్రధాన ధార. వయ్యారాలు,

వంపులతో జాలువారే ఇంకొక పాయకు 'రాణి' అని పేరు పెట్టారు. ఈ ధార పెద్ద శబ్దం చేస్తూ, వేగంగా కిందికి ప్రవహిస్తుంది. సున్నితంగా రాళ్లపై జారుతూ కనిపిస్తుంది. ఇది తెల్లటి నురగలు కక్కుతూ చాలా సున్నితంగా, అందంగా కిందికి జారుతుంది. మరోపాయ 'రోరర్' జలపాతం పెద్ద పెద్ద రాళ్ళ మధ్యనుండి అతి పెద్ద శబ్దం చేస్తూ కిందికి జాలువారడం వల్ల దీనికి 'రోరర్' అని పేరు పెట్టారు. ఉరుములాంటి శబ్దంతో వేగంగా

దూసుకుపోవడం వల్ల ఈ పేరు వచ్చింది. మరో పాయ అతి వేగంగా సన్ననిపాయగా, రాకెట్‌లా దూసుకొని జాలువారడంతో దీనికి 'రాకెట్' అని పేరు పెట్టారు. రాకెట్‌లా వరుస జలధారలుగా కిందికి దూసుకుపోతుంది. ఇది ఒక సన్నని పాయలా ఉండి, విపరీతమైన వేగంతో రాకెట్ వలె దూసుకుపోతుంది.

ఒకప్పుడు నాటి ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన మిత్రులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ అపురూప జలపాతాన్ని సందర్శించిన ఆనందం క్షణాల్లో మటుమాయమైంది. ఎందుకంటే జోగ్ జలపాతం నీరంతా వృధా అవుతోందని ఆయన ఆవేదన చెందారు. ఈ నీటిని వ్యవసాయం, విద్యుచ్ఛక్తి అవసరాలకు ఉపయోగిస్తే బావుంటుందని ఆలోచించారు. ఆయన ఆలోచనకు పర్యవసానంగా 'మహాత్మాగాంధీ హైడ్రో ఎలక్ట్రికల్ వర్క్స్'కు రూపకల్పన చేసి అటు విద్యుచ్ఛక్తి ఇటు వ్యవసాయానికి నీరు అంది వేల ఎకరాల బీడు భూమి సాగులోకి వచ్చింది. 1948వ సంవత్సరంలో ఇక్కడ విద్యుత్ ఉత్పాదన కోసం 'కృష్ణరాజేంద్ర హైడ్రోఎలెక్ట్రిక్ ప్రాజెక్ట్'ను ప్రారంభించారు. పూర్వపు మైసూర్ రాజైన నాల్గవ కృష్ణరాజ వడియారు పేరుమీద దీనిని 'కృష్ణ రాజేంద్ర విద్యుత్ ప్రాజెక్ట్' అని పిలిచారు. తరువాత దీని పేరును మహాత్మా గాంధీ హైడ్రోఎలెక్ట్రిక్ ప్రాజెక్ట్‌గా మార్చారు. భారతదేశంలో మొట్టమొదటి జలవిద్యుత్ ప్రాజెక్ట్ లలో ఒకటైన 'మహాత్మా గాంధీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ (పూర్వపు మైసూరు స్టేట్ పవర్ హౌస్)ను ప్రారంభంలో ఈ జలపాతానికి సమీపంలోనే ఏర్పాటు చేశారు. కర్ణాటకకు విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్ట్ చారిత్రక పాత్ర పోషించింది. ఆ తర్వాత కాలంలో దీని సమీపంలోనే 'లింగనమక్కి డ్యామ్' నిర్మాణం జరిగింది. 1964లో శరావతి నదిపై లింగనమక్కి ఆనకట్ట నిర్మించారు. ఈ డ్యామ్ నిర్మాణం వల్ల జలపాతానికి వచ్చే నీటి

ప్రవాహం నియంత్రించారు. వర్షాకాలంలో డ్యామ్ గేట్లు ఎత్తినప్పుడు ఈ జలపాతం తన పూర్తి స్థాయి విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

ఆ తరువాత కర్ణాటక ప్రభుత్వం నాలుగు దశల్లో జోగ్ జలపాతాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది. మొదటి దశలో ఈ ప్రదేశంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వాటర్ ఫౌంటెయిన్స్‌ను నిర్మించాలి. పిల్లల కోసం కిడ్స్ వరల్డ్ ఏర్పాటు చేయాలి. భోజనశాలలు, వసతి సౌకర్యాలు కల్పించాలి. వీటి కోసం నాలుగు కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా.

రెండో దశలో జోగ్ జలపాతం వద్ద హైడ్రో ఎలక్ట్రిక్ జనరేటర్ ఏర్పరచాలి. ఈ విద్యుత్ ఉత్పత్తి పనులకు వంద కోట్ల రూపాయలు ఖర్చు కాగలవని అంచనా వేశారు. మూడవ దశలో 15 కోట్ల రూపాయల వ్యయంతో సింగపూర్‌లో వున్న జురాంగ్ బర్డ్ పార్క్ తరహా అత్యాధునికమైన పక్షుల పార్కును నిర్మించాలి.

నాలుగవ దశలో వెయ్యి మీటర్ల ట్రీటవర్‌ను 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించాలని ప్రతిపాదనలున్నాయి. ఈ సిఫార్సులను విశ్వనాథ్ కమిటీ చేసింది. అయితే కర్ణాటక ప్రభుత్వం వీటిని సూత్ర ప్రాయంగా అంగీకరించడమేకాక కార్యరూపంలో కొన్ని పనులు కొన సాగించింది. చక్కటి సౌకర్యాలు కల్పించడం వల్ల ఏడాది పొడవునా దేశ విదేశీ పర్యాటకులు జోగ్ జలపాతాన్ని తిలకించ డానికి అసంఖ్యాకంగా వస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

19వ శతాబ్దంలో బ్రిటిషు పాలకుల కాలంలో ఈ ప్రాంతం వెలుగులోకి వచ్చింది.

పశ్చిమ కనుమలను సందర్శించిన బ్రిటిషు అధికారులు ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులై దీనిని ప్రపంచానికి పరిచయం చేశారు. కర్ణాటక పర్యాటక శాఖ ప్రకారం ఆగస్టు నుంచి డిసెంబరు వరకు జోగ్ జలపాతాన్ని చూడటానికి మంచి కాలం. ముఖ్యంగా వర్షాకాలంలో లింగనమక్కి జలాశయం నుంచి నీటి విడుదల పెరిగినప్పుడు జోగ్ జలపాతం అపూర్వమైన వైభవాన్ని సంతరించుకుంటుంది. శరావతి నది నిండుగా ప్రవహించడంతో జోగ్ జలపాతం పూర్తి వైభవంతో, పచ్చని అడవుల నడుమ పర్యాటకులను అద్భుతంగా ఆకట్టుకుంటుంది. దశాబ్దాలుగా ఇది దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రముఖ హాలీడే, నేచర్ డెస్టినేషన్‌గా మారింది. జలపాతం వీక్షణ కోసం ప్రభుత్వం మెట్లను, వ్యూ పాయింట్లను అభివృద్ధి చేసింది. జోగ్



జలపాతం చాలా కాలంగా ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నప్పటికీ, రహదారి, రైల్వే, వసతి వంటి సౌకర్యాలు అభివృద్ధి చెందడంతో ఇది కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారింది. ప్రస్తుతం ప్రధాన వీక్షణ ప్రాంతాల నుంచి నాలుగు జలపాతాలను చూడవచ్చు.

జలపాతం అడుగు భాగానికి చేరడానికి సుమారు 1,400 మెట్లు కూడా ఉన్నాయి. ప్రకృతి సృష్టించిన మహా జలపాతం నుంచి, శరావతి నది శక్తిని విద్యుత్తుగా మార్చిన ఆధునిక ఇంజినీరింగ్ అద్భుతం వరకు జోగ్ జలపాతం చరిత్ర ప్రకృతి, విజ్ఞానం, పర్యాటకం ఇత్యాదివి కలగలిపి దేశ, విదేశీ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

---

**(20వ పేజీ తరువాయి..)**

## వీలునామా..

“ఇది పూర్తిగా కుదురుతుంది. ఇదంతా మీ నాన్నగారు ముందుగా ఆలోచించి రాసిన వీలునామా నాయనా!” అంటూ లాయర్ విశ్వనాథం గారు ఆ వివరాలు అన్నీ చదివి వినిపించారు.

“హూ.. అనుకున్నంతా అయ్యిందన్నమాట” అని అల్లుడు రాంబాబు అన్నాడు.

“ఒరేయ్ రాముడూ! మీ గురించి మీ నాన్న ముందే తెలుసుకొని ఈ ఏర్పాటు చేసాడురా. ఆయన పోతూ, పోతూ మీ అమ్మను ఒంటరిని చేయలేదు. సంస్కారవంతమైన ఓ సమాజాన్ని ఆవిడకు తోడుగా ఇచ్చి వెళ్ళాడురా. మీ నాన్న చాలా గొప్పోడురా!” అని చంటి బాబాయ్ అన్నాడు.

“ఆయన గొప్పోడు కాదు బాబాయ్, మహానుభావుడు. తమ కడుపున పుట్టిన సంతానం చేత బయటకు గెంటేయబడిన ఎందరో తల్లులకు, తండ్రులకు ఓ అందమైన దేవాలయాన్ని రూపొందించిన మహనీయుడు మా చంద్రయ్య మాస్టారు” అని రాజు, సుందరం అన్నారు.

“సరే! మీ అందరి నిర్ణయాలు అవే అయితే సంతోషం. మేం వెళ్తున్నాం. మళ్ళా ఈ ఇంటి గడప తొక్కం ఏమి జరిగినా?” అంటూ కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు వెళ్ళబోతుంటే–

“ఒరే నాయనా! మీ నాన్న చదువు, సంస్కారం నేర్పి ఎందరికో దేవుడయ్యారు. కానీ కన్న సంతానానికి మాత్రం సంస్కారం నేర్పలేని చేతకానివారయ్యారురా వెళ్ళండి. ఏమి జరిగినా.. మళ్ళీ మీరెవరూ ఈ ఇంటి గడప తొక్కవద్దు. కానీ మీకు ఎప్పటికైనా అవసరమొస్తే చంద్రయ్య అనాథాశ్రమం మిమ్మల్ని ఆదుకుంటుంది కన్నతల్లిలా. వెళ్ళండిరా, వెళ్ళిపోండి” అంటూ సూరమ్మ గారు లోపలికెళ్ళిపోయారు.

కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు అందరూ ఇల్లు విడిచి మౌనంగా వెళ్ళిపోయారు. చంటి బాబాయ్ పర్యవేక్షణలో చంద్రయ్య అనాథాశ్రమం పనులు చేయడానికి రాజు, సుందరం, సూరి, కమల మొదలైన శిష్యులు ఆనందంగా అడుగులేసారు.

## వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



# కాంతివేధ అంటే ఏమిటి?



వాయువ్య గృహం; దిక్పతి-కేతువు; దిక్పాలకుడు-వాయుదేవుడు

పడమర, ఉత్తరం వీధులున్న స్థలాన్ని 'వాయువ్య' స్థలం అంటారు. వాయువ్య స్థలంలో నిర్మించిన గృహాన్ని 'వాయువ్య గృహం' అంటారు.

పశ్చిమ సింహద్వారం లేదా పశ్చిమ వాయువ్య సింహద్వారం గల గృహాన్ని 'ప్రథమ ప్రాధాన్యత' కలదిగా నిర్మించుకోవాలి. వ్యవహార నామరీత్యా ఉత్తర సింహద్వార యోగమున్నప్పుడు ఉత్తరంలో రాజవీధి కలిగి ఉన్నప్పుడు మాత్రమే ఉత్తర ముఖద్వారం/ఉత్తర ఈశాన్య ముఖ ద్వార గృహాన్ని 'ద్వితీయ ప్రాధాన్యత'గా నిర్మించుకోవచ్చు.

'వాయువ్య గృహానికి వాయువ్య దిక్పతి అయిన కేతువు, వాయువ్య దిక్పాలకుడైన వాయుదేవుడు' ప్రభావం విశేషంగా ఉంటుంది. వారి అనుగ్రహాన్ని ఆ గృహం పొందాలంటే, ఆ గృహానికి వాయువ్య దోషాలు ఉండకూడదు. అలాగే వాయువ్య దిక్పతి అయిన కేతువు ప్రసన్నం కావటానికి వాయువ్య గృహం 'శ్వేత వర్ణం'ను ప్రధాన వర్ణంగా సంతరించుకొని ఉండాలి. వాయువ్య గృహానికి 'శ్వేత వర్ణం' ప్రధాన వర్ణంగా లేనట్లయితే ఆ గృహం 'కాంతివేధ' అనే వాస్తుదోషం పొంది అందులో నివసించే వారికి అనేక ఇక్కట్లను కలిగించే అవకాశం ఉంటుంది.

ఆ ఇల్లు వాస్తు ప్రకారం చక్కగా నిర్మించినప్పటికీ 'కాంతివేధ' దోషం కలిగివుంటే, ఆ గృహం ఇవ్వవలసిన మంచి ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. వాయువ్య గృహం అయినప్పటికీ పశ్చిమ ముఖద్వార యోగమున్నవారు ఈ గృహమునందు విశేష ఫలితాలను పొందవచ్చు.

జాతకరీత్యా కేతువు వలన బాధలు పొందవలసిన జాతకమున్నవారు సైతం వాయువ్య దిక్పతి 'కేతువు' ప్రసన్నమయ్యే విధంగా 'కాంతివేధ' దోషం లేని గృహంలో నివసించటం చేత వాయుదేవుడు, కేతువు అనుగ్రహానికి పాత్రులవుతారు. జాతకరీత్యా కేతువు వలన వచ్చే బాధలను, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి వాయువ్య, కేతువు అనుగ్రహంతో అభివృద్ధిని పొందగలుగుతారు. ఆ జాతకునికి కేతువు మంచి చేసే స్థానంలో ఉన్నట్లయితే ఇలాంటి 'కాంతివేధ' లేని 'వాయువ్య' గృహం' ఆ జాతకునికి అద్భుతమైన ఫలితాలను అందిస్తుందని చెప్పటం అతిశయోక్తి కాదు.

### గొప్ప ఫలితం!

నేను మీ శీర్షికను రెగ్యులర్ చదువుతూ ఉంటాను. కొన్ని నెలల క్రితం ఒక పాఠకుడి పరిస్థితి బాగాలేక కొన్ని ఆర్థిక సమస్యల్లో ఉన్నప్పుడు మీకు రాసిన ఉత్తరానికి బదులుగా మీరు సలహా ఇస్తూ- "శనివారం రోజున గుడి దగ్గర చిల్లరంతా దానం చేసేసి ఖాళీ జేబులతో ఇంటికెళ్లమని" సలహా ఇచ్చారు. అప్పుడు మా పరిస్థితి కూడా అలాగే ఉండింది. మీ మాట మీద మాకు చాలా నమ్మకం. అందువల్ల నేను కూడా శనివారం మాకు దగ్గరలో ఉన్న ఆలయానికి వెళ్లాను. దర్శనానంతరం మీ సలహా ప్రకారమే నేను తీసుకెళ్లిన చిల్లరంతా గుడి బయట కూర్చున్న వాళ్లకి దానం చేసి ఇంటికి చేరుకున్నాను. ఆ తరువాత ఆ విషయం గురించి పెద్దగా ఆలోచించలేదు. నెలలు గడిచాయి.... క్రమంగా ఆర్థిక పరిస్థితి మెరుగవటం గమనించాను.

ఇంత చిన్న పని చేస్తే ఇంత గొప్ప ఫలితం లభించటం నమ్మశక్యంగాని విధంగా ఉంది. ఈ సలహా వలన ఇంకెంతో మాలాగే మంచి ఫలితాలు పొందాలన్న కోరికతో ఈ ఉత్తరం రాస్తున్నాను.. మీకు ధన్యవాదములు.

### వాస్తులో అద్భుతాలెన్నో!

1) జాతకం సాధారణంగా ఉన్నప్పుడు దక్షిణ ముఖ ద్వార గృహంలో నివసించటం విశేషం కాదు. 2) జాతక రీత్యా కుజుడు బలంగా ఉన్నప్పుడు దక్షిణ సింహ ద్వార గృహంలో నివసించటం వలన విశేష లాభం ఉంటుంది. కానీ అది కూడా విశేషమేమీ కాదు.

3) జాతకరీత్యా కుజుడు బలంగా లేనప్పుడు ఇటువంటి గృహంలో నివసించటం విశేషంగా చెప్పుకోవలసి వస్తుంది. 'జాతకరీత్యా కుజుని వలన చెడు ఫలితాలను పొందవలసి వస్తూ, వాస్తురీత్యా తిరిగి కుజుని వలన మంచి ఫలితాలు పొందగలగటమనే విషయం వాస్తు శాస్త్రంలో ఓ అద్భుతమనే చెప్పుకోవాలి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ..................
చిరునామా:..............................................

# తేలియాడే ఏకైక ఉద్యానవనం

**ప్రపంచవ్యాప్తంగా సుమారు 6,000 నుండి 6,500 జాతీయ పార్కులు ఉన్నాయి. అయితే, వివిధ దేశాలు, సంస్థలు జాతీయ పార్కును ఎలా నిర్వచిస్తాయనే దానిని బట్టి ఈ సంఖ్యలలో తేడాలు ఉంటాయి. 2026 నాటికి భారతదేశంలో 107 జాతీయ ఉద్యానవనాలు (నేషనల్ పార్కులు) ఉన్నాయి.**

1936లో ఉత్తరాఖండ్‌లో నిర్మించబడిన జిమ్ కార్బెట్ జాతీయ ఉద్యానవనం భారతదేశంలో మొట్ట మొదటి జాతీయ ఉద్యానవనం. లడఖ్‌లో సుమారు 4,400 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న హెమిస్ జాతీయ ఉద్యానవనం దేశంలోనే అతిపెద్ద జాతీయ ఉద్యానవనం కాగా, అండమాన్ నికోబార్ దీవులలో సుమారు 5 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సౌత్ బటన్ ఐలాండ్ జాతీయ ఉద్యానవనం దేశంలోని అతిచిన్న జాతీయ ఉద్యానవనం.

అయితే చెరి తొమ్మిది జాతీయ ఉద్యానవనాలతో అత్యధిక ఉద్యానవనాలు కలిగిన రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతంగా మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు ఉన్నాయి. అయితే, ప్రపంచంలోనే ఏకైక తేలియాడే జాతీయ ఉద్యానవనం 'కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనం' మాత్రం మణిపూర్ రాష్ట్రంలోని బిష్ణుపూర్ జిల్లాలో ఉంది.

– చట్టాలను చేయడం ప్రపంచానికి పరిపాటి. కానీ ప్రపంచంలో అధి భాగం ఆచారాలనే పాటిస్తుంది.

**– ఇబ్సన్**

– ఎంత గొప్ప చదువు అయినా ప్రావీణ్యత అలవాటు అవ్వాలంటే, అది చెప్పేవారిపై ఆధారపడి ఉంటుంది. **– మహాత్మా గాంధీ**

– చదువుకు క్రమశిక్షణ తోడైతే బంగారానికి తావి అబ్బినట్లుగా ఉంటుంది. **– సర్వేపల్లి రాధాకృష్ణన్**

## మణిపూర్ రాష్ట్రానికే మకుటాయమానం

కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనం లోక్‌తక్ సరస్సు నైరుతి భాగంలో ఉంది. ఇది మణిపూర్ రాష్ట్ర నాట్య జింకగా ప్రసిద్ధి చెందిన బ్రౌయాంట్లెర్డ్ డీర్ (సంగై) చివరి సహజ ఆవాసం. ఇక్కడి ప్రత్యేకమైన చిత్తడి నేల పర్యావరణ వ్యవస్థలో జింకలను చూడటం వన్యప్రాణి ప్రేమికులకు గొప్ప మధురానుభూతిని కలిగిస్తుంది.

ఇక్కడ కనిపించే ఇతర వన్యప్రాణులలో హాగ్ డీర్, ఆటర్ సహా అనేక రకాల నీటి, వలస పక్షులు ఉన్నాయి. వలస పక్షులు ఈ ఉద్యానవనంలో సాధారణంగా నవంబర్ నుండి మార్చి వరకు కనిపిస్తాయి. మణిపూర్ అటవీ శాఖ ఈ పార్కులో వాచ్ టవర్లు, రెండు విశ్రాంతి గృహాలను నిర్వహిస్తుంది.

అక్కడ జంతువులను వేటాడటం పూర్తిగా నిషేధించబడింది. ఈ జాతీయ ఉద్యానవనం తొలుత 1966లో వన్యప్రాణుల అభయారణ్యంగా గుర్తింపు పొందింది. ప్రధానంగా ఈ ప్రాంతానికి మాత్రమే పరిమితమైన 'బ్రౌయాంట్లెర్డ్ డీర్' (సంగై జింక) జాతిని రక్షించడం కోసం దీనిని స్థాపించి, ఆ తరువాత, 1977లో దీనిని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించారు. ఈ ఉద్యానవనంలో పాబోట్, తోయా, చింగ్జావో అనే మూడు కొండలు ఉన్నాయి. వర్షాకాలంలో నీటిమట్టాలు పెరిగి ఇక్కడి వన్యప్రాణుల సాధారణ ఆవాసాలు మునిగిపోయినప్పుడు, ఈ కొండలు వాటికి కీలకమైన ఆశ్రయాలుగా పనిచేస్తాయి.

ఈ జాతీయ ఉద్యానవనం కేవలం ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రం మాత్రమే కాదు. పక్షులు, వన్యప్రాణి ప్రేమికులకు లేదా అరుదైన సహజ దృగ్విషయాలపై ఆసక్తి గల వారికి ఈ ఉద్యానవనం ఎంతో ఉత్కంఠభరితంగా ఉండటంతో పాటు అనిర్వచనీయమైన అలౌకిక ఆనందాన్ని అందిస్తుంది. ఇక్కడ ప్రత్యేకమైన సంగై జింకలను నీటిపై



తేలియాడే ఫుమ్డిలను సంరక్షించడం, ప్రకృతి పరిరక్షణ సాధించగల అద్భుతాలకు ఒక నిదర్శనంగా అభివర్ణించవచ్చు. ఫుమ్డీ (Phumdi) అంటే లోక్‌తక్ సరస్సులో నీటిపై తేలియాడే వృక్షసంపద, మట్టి, సేంద్రీయ పదార్థాల సముదాయం. వీటిని తేలియాడే ద్వీపాలు అని కూడా పిలుస్తారు.

## సహజ ఆకర్షణ

కీబుల్ లాంజావో అందం దాని అసాధారణమైన తేలియాడే భూభాగం మరియు గొప్ప జీవవైవిధ్యంలో ఉంది. చిత్తడి నేలతో కూడిన పర్యావరణ వ్యవస్థ, గడ్డి మైదానాలు, జల ఆవాసాల అద్భుతమైన సమ్మేళనం. ఈ ఉద్యానవనాన్ని ఒక పర్యావరణ నిధిగా నిలుపుతుంది. ఇక్కడి తేలియాడే ద్వీపాలపై వృద్ధి చెందుతున్న అరుదైన వృక్ష, జంతుజాలాల దృశ్యం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రకృతి ప్రేమికులను, పర్యావరణవేత్తలను, ఫొటోగ్రాఫర్‌లను అమితంగా ఆకర్షిస్తుంది.

## అద్భుతమైన పర్యాటక ప్రదేశం

కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించే పర్యాటకుల కోసం ఇక్కడ అనేక రకాల కార్యకలాపాలు అందుబాటులో ఉన్నాయి.





ఇక్కడి నీటిపై తేలియాడే జీవపదార్థంపై నడవడం అద్భుతమైన ఒక వింత అనుభవం. వివిధ కాలాలలో ఇక్కడికి విచ్చేసే అనేక జాతుల వలస పక్షులు సందర్శకులకు వీనుల విందు చేయడంతో పాటు వారి హృదయాలను తేలికపర్చి తన్మయత్వంతో తమను తాము మర్చిపోయేలా చేస్తుంది. ఈ ఉద్యానవనంలో ఉండే గైడెడ్ బోట్ టూర్లు మరో ప్రత్యేక ఆకర్షణ. నీటితో నిండిన ఫుమ్డిల గుండా సందర్శకులు ఈ బోట్లలో ప్రయాణిస్తున్నప్పుడు ఉద్యానవనంలోని వన్యప్రాణులను, ముఖ్యంగా సంగై జింకలను దగ్గరగా చూసే అవకాశం లభిస్తుంది.

ఈ ఉద్యానవనం భౌగోళిక స్వరూపంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉన్న ఈ ఫుమ్డిలు చాలా దట్టంగా, దృఢంగా ఉండి గణనీయమైన బరువును మోసే సామర్థ్యం కలిగి ఉంటాయి. దీనివల్ల జింకలు, మనుషులు కూడా వాటిపై ఎటువంటి ప్రమాదం లేకుండా హాయిగా నడవగలరు.

## పరిసర ఆకర్షణలు

కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనం చుట్టుపక్కల ప్రాంతం సాంస్కృతిక మరియు సహజ ప్రదేశాలతో సమృద్ధిగా ఉంటుంది. ఈ జాతీయ ఉద్యానవనానికి సమీపంలో ఉండే లోక్‌తక్ సరస్సు తప్పక సందర్శించాల్సిన ప్రదేశం. అక్కడ సూర్యోదయం, సూర్యాస్తమయ సమయంలో చేపలను వేటాడే జాలర్లను చూడవచ్చు. ఇది సహజంగానే సుందరమైన ఆ ప్రకృతి దృశ్యానికి మరింత శోభను చేకూరుస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో భారత జాతీయ సైన్యం మొదటిసారిగా భారత జెండాను ఎగురవేసిన జ్ఞాపకార్థం నిర్మించిన మోయిరాంగ్‌లోని ఐఎన్ఏ స్మారక చిహ్నం కూడా ఇక్కడికి కొద్ది దూరంలోనే ఉంది. అంతేకాకుండా, పురాతన నగరమైన ఇంఫాల్ సహ సందడిగా ఉండే అక్కడి మార్కెట్లు, యుద్ధ స్మారక చిహ్నాలతో, మణిపూర్ సాంస్కృతిక వైభవాన్ని కూడా సందర్శకులు ఆకళింపు చేసుకునే అవకాశం ఉంటుంది.

## రవాణా సౌకర్యాలు

మణిపూర్ రాజధాని ఇంఫాల్ నుండి కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనం రోడ్డు మార్గం ద్వారా సుమారు 53 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ జాతీయ ఉద్యానవనానికి విమాన, రైలు, రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. ఢిల్లీ, కోల్‌కతా, గౌహతి వంటి ప్రధాన నగరాల నుండి ఇంఫాల్‌కు విమానంలో చేరుకొని అక్కడి నుండి రోడ్డు మార్గాన చేరుకోవచ్చు.

నాగాలాండ్‌లోని డిమాపూర్ ఇంఫాల్‌కు సుమారు 215 కి.మీ దూరంలో ఉంటుంది. డిమాపూర్ లేదా జిరిబామ్ నుండి ట్యాక్సీలు లేదా బస్సుల ద్వారా రోడ్డు మార్గంలో ఇంఫాల్ మీదుగా కూడా ఇక్కడికి చేరుకోవచ్చు. ఇది కాకుండా, ఇంఫాల్ నుండి బిష్ణుపూర్, మొయిరాంగ్ మీదుగా కీబుల్ లాంజావో జాతీయ ఉద్యానవనానికి బస్సులు లేదా ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.

ఈ ఉద్యానవన సందర్శనకు నవంబర్ నుండి ఏప్రిల్ వరకు అత్యంత అనువైన సమయం. ఈ సమయంలో తేలియాడే ఫుమ్డిలు మరింత స్థిరంగా ఉండడంతో



ఉద్యానవనంలో తిరగడం సురక్షితంగా ఉంటుంది. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పార్క్ తెరిచి ఉంటుంది. అయితే ఉదయం పూట (సూర్యోదయ సమయం) వన్యప్రాణులను చూడడం వలన కలిగే ఆనందాన్ని అనుభవించి తీరాల్సిందే!

**– యేచన్ చంద్రశేఖర్**




– గతం చూసి గర్వించడం తప్పు. ప్రస్తుతాన్ని అధ్యయనం చేయడం అవసరం. – కుందుర్తి

– గమ్యం శత్రువుల్ని పెంచుతుంది; మిత్రుల్ని పారదోలుతుంది.

– చదవడం వల్ల ప్రయోజనం ఏమంటే నలుమూలల నుండీ వచ్చే విజ్ఞానాన్ని పొందడం, దాన్నుండి గుణపాఠాలు చేర్చుకోవడం.

– కోరిక ఆలోచనకు మూలం.

## పుస్తక సమీక్ష

## ఆచార్య ఇనాక్ కథల అపూర్వ రచన

"పీడితుల పక్షాన నా పోరాటం.. అదే నా సాహిత్య రూపం. వాళ్ల కోసమే నేను రాస్తున్నాను. వాళ్లు విముక్తులైతే చాలు. దళితులు, స్త్రీలు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వాళ్లు నా పరిధి" ఆచార్య కొలకలూరి ఇనాక్ కథానికా దృక్పథంపై 'అపూర్వ' గ్రంథ శీర్షికగా, ప్రముఖ రచయిత 'విహారి' ఆచార్య ఇనాక్‌పై మాటలను ప్రస్తావించారు.

తెలుగులో అంతర్జాతీయ స్థాయి కథలు లేవనే విమర్శకులకు, సాహితీవేత్తలకు విహారి, ఆచార్య ఇనాక్ కథల క్రాంతి దర్శనం, కథల ఆత్మ, రచయిత అద్భుత అంతఃకరణ ఈ పుస్తకంలో విశదం చేసారు. పశ్చాద్భూమి గురించి విహారి ప్రస్తావిస్తూ ఆ కథలోని సామాజిక వాస్తవ చిత్రణ, అంతర్లీనంగా వున్న మానవ హృదయ ఘోషకు మించిన విశ్వస్థాయి కళాత్మక భావం, భాష ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందగల అర్హత వుందన్నారు. విహారి విశ్లేషించిన కథలన్నింటిలో సామాజిక వేదన, అభ్యుదయ కాంక్ష, దళిత జీవన విధాన్ని గుండెగొంతుకలో నిలుపుకొన్ని అనుభవాలు కథారూపంలో సాక్షాత్కరిస్తున్నాయి. ఊరబావి, పోలే, ఆకలి, పిండీకృతశాటి, పశ్చాద్భూమి, గొడ్లదొంగ, తలలేనోడు కథలలోని సామాజిక వాస్తవికత, దళిత జీవన విషాదం, తెలుగు కథా ప్రపంచంలో పల్లెబతుకులపై సాగుతున్న దోపిడీ, ఊడలు దిగిన ధన, కుల బలం చేసే స్వార్థ, దౌర్జన్యం సృష్టించే వేదనను ప్రతిబింబిస్తున్నాయి. తెలుగు కథకు విశ్వవేదికపై నోబుల్ లభించే కథా సాహిత్యం సృష్టించగల కథామేధావి ఇనాక్‌ను తప్పక నోబుల్ వరించి మన ఆశ ఫలించి తీరుతుంది.

**(అపూర్వ(ఆచార్య కొలకలూరి ఇనాక్ కథానికా దృక్పథం)-రచన: విహారి; ప్రతులకు: జ్యోతి గ్రంథమాల, 4-282, యన్.యస్.నగర్, మీర్‌పేట, హైదరాబాద్-500 097)**

## అద్భుత కవిత్వం

భౌతిక శాస్త్ర పదాలను, కవిత్వ తాత్త్విక భావ వ్యక్తీకరణతో సంధానించి, విలక్షణ కవిత్వాన్ని సృజించే, 'ఫిజిక్స్ అరుణ్‌కుమార్', కవితాప్రియులను 'జీరో గ్రావిటీ అనుభవింపచేసే తాదాత్మ్యత వైపు పరిభ్రమింపచేస్తున్నారు. వైజ్ఞానికంగా, జీరో అంటే శూన్యం. నగ్రావిటీ గురుత్వాకర్షణ. ఈ శూన్య గురుత్వం ఒక భారరహిత స్థితి. శూన్యంలో బిగ్ బ్యాంగ్‌గా, ఫిజిక్స్ అరుణ్‌కుమార్ సృష్టించిన సంచలనం, గ్రావిటీ కవన యానంగా అక్షర రూపం దాల్చింది. సునీతా విలియమ్స్ స్పేస్‌వార్ కవితలో, అంతరిక్ష చెరసాలలో భారరహితమై ఆమె బందీ అయింది... అంటూ రోదసి ఆమె ప్రేయసి అయిందంటారు. గణితం నేస్తంగా, భౌతిక శాస్త్రం ఉద్యమ ఆత్మీయంగా, తెలుగు కవితాత్మకు శాస్త్రీయ మానవీయ తాత్త్వికత అందించే 58 కవితలు ఈ సంపుటిలో చోటు చేసుకొన్నాయి. ఫిజిక్స్ అరుణ్‌కుమార్ చిన్నారులకు ఒత్తిడిలేని చదువులు, యుద్ధంలేని బాల్యం కోరుకొంటారు. కూరగాయలమ్మో!లో అవ్వబతుకు వేదన వినిపింపచేస్తారు. అందెశ్రీ పాటల పూదోట స్ఫురింపచేసినా, తల్లిడిల్లిన తెలంగాణ గుండెలు చెరువులు తలపింపచేసినా, జ్ఞాన గెలాక్సీలను మానవతా విశ్వవనంలో పెంచుకుందాం అన్నా, తెలంగాణ పల్లెబతుకు సిత్రంలో ఉద్యమ ఊపిరి గళం వినిపించినా, జయశంకర్ సార్, జై తెలంగాణ నినాదమే ఆయన గుండె పలికిన ప్రాణ సంతకంగా ధ్వనింపచేసినా ఫిజిక్స్ అరుణ్‌కుమార్ అద్భుత కవిత్వ వ్యక్తీకరణతో 'జీరోగ్రావిటీ' సంపుటిని తన కవనయాన ప్రస్థానంలో, జనన మరణాల మధ్య బతుకంతా కవిత్వంగా నిర్వచించిన వైజ్ఞానిక అక్షర, దిగంతాల యాత్రికునిగా అభినందనీయులు.

**(జీరోగ్రావిటీ(కథాసంపుటి)-రచన: ఫిజిక్స్ అరుణ్‌కుమార్, వెల: రూ.180/-లు; ప్రతులకు: ఫిజిక్స్ అరుణ్‌కుమార్, సన్నాఫ్ సుబ్బయ్య, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు జిల్లా, తెలంగాణ-509 209)**

## హృదయాలను కదిలించే కథలు

తన కళ్లకు సాదాసీదాగా, అప్రయోజకునిగా చులకనగా కనిపించే భర్త, ఒక వ్యక్తిని కలెక్టరు చేసిన ఉత్తమ వ్యక్తిత్వం గలవాడని తెలుసుకొన్న తర్వాత, ఆ భార్యలో వచ్చిన మార్పు, భర్తలో ఆమెకు కొత్త ముఖం కనిపించటం, 'మరో ముఖం'గా కథను సృష్టించిన కథారచయిత జిల్లేళ్ల బాలాజీ హృదయాలను కదిలించి, కళ్లు చెమర్చే మరికొన్ని కథలు సంపుటిగా వెలువరించటం అభినందనీయం. ఆత్మీయతలు, ప్రేమాభిమానాలు, మానవతా విలువలు, సంబంధ బాంధవ్యాలు చెరిగిపోతున్న సమాజంలోని జీవితాలలోని వేదన, విచ్ఛిన్న స్థితిగతుల ప్రభావం కళ్లకు కట్టించటంలో రచయిత బాలాజీ కృతకృత్యత సాధించారు. 'ఆప్తహస్తం'లో తాయమ్మను దొమ్మరోళ్లు ఆదుకోవటం, 'నా కొడుకు ఢిల్లీలో ఉండాడు!' లో కొడుకు నిర్దయగా, నిస్సహాయంగా వదిలేసిన వృద్ధ దంపతులు, ఆపదలో చిక్కుకున్న ఒక యువకుడిని కాపాడటం, 'రోడ్డు దాటలేని మనిషి' చక్కటి సందేశం అందించటం, 'అవిశ్యాకు', దాయాదుల మధ్య అల్లుకున్న బంధుత్వానికి తిరుగలేని గుర్తుగా కలిసిమెలిసి సుఖదుఃఖాలు పంచుకోవాలనే సందేశాత్మక కథనం, 'పెండ్లిమేళం'లో వృత్తి కళాకారులైన మేలగాళ్ల పడే వ్యథ ఈ సంపుటిలోని అన్ని కథలలో జీవన విలువల సందేశం కథా రచయిత ప్రతిభావంతంగా వ్యక్తీకరించారు. కథలకు ఛాయా రేఖా చిత్రాలు సంపుటికి నిండుదనం చేకూర్చాయి.

**(మరో ముఖం(మరికొన్ని కథలు); రచన: జిల్లేళ్ల బాలాజీ; ప్రతులకు: జిల్లేళ్ల బాలాజీ, 9-535, ఓం శక్తి ఆలయం పక్కన, లింగేశ్వర నగర్, బైరాగిపట్టెడ, తిరుపతి-517 501, ఆంధ్రప్రదేశ్)**

– జయసూర్య



# వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి**
ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1.
ఫోన్ : 98494 53449, 94409 27795



## మేషం

ఈ వారం వృత్తి, ఉద్యోగ వ్యాపారాలలో స్వల్పమైన ఒడిదుడుకులు చోటు చేసుకుంటాయి. సహనానికి పరీక్షలు ఎదురవుతాయి. స్థిరాస్తులను కొనుగోలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి. ఎక్కువగా ఇతరుల నుండి సలహాలను, సూచనలను పాటిస్తారు. ఋణాలు ఇవ్వడం తీసుకోవడం రెండూ అనుకూలంగా పరిణమించవు. నిత్యం సర్వరక్షా చూర్ణంతో స్నానమాచరించడం, రుద్రకవచం పఠించడం మంచిది.



## వృషభం

ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. పనులలో పురోగతి ప్రయత్న కార్య సిద్ధి లభిస్తుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధి స్తారు. ఋణబాధలు చాలా వరకు తీరతాయి. కొత్త బాంధవ్యాలు ఏర్పడతాయి. శత్రువులు ప్రయోజనాలను ఆశించి మీతో తాత్కాలిక మిత్రత్వానికి రాజీ యత్నాలను సాగిస్తారు.



## మిథునం

ఈ వారం పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. జీవితభాగస్వామి నుండి సహాయం అందుకుంటారు. వివాదాలకు దూరంగా ఉండడం అన్ని విధాలా శ్రేయస్కరం. వృత్తి, వ్యాపారా లలో స్వల్ప లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి. వివాహ యత్నాలు సాగిస్తారు. షేర్లు భూముల క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.



## కర్కాటకం

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటుంది. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. నిత్యం జిల్లేడు వత్తులతో దీపారాధన చేయడం వలన సమస్యలు కొంతవరకు తీరతాయి. కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. రాజకీయ, కళారంగాల వారికి ప్రోత్సాహంగా ఉంటుంది.



## సింహం

ఈ వారం మీకన్నా ఉన్నత శిఖరాలలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకుంటారు. పోటీ తత్వాన్ని పెంచుకుం టారు. అదృష్టాన్ని ఏమాత్రం నమ్ముకోరు. బౌన్స్ అయిన చెక్కులను గ్రహించడం గాని, మీరు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అవడం గానీ జరిగే సూచనలు ఉన్నాయి. ప్రయోజ నాలను ఆశించి కొందరు స్వార్థ బుద్ధితో మీతో స్నేహాలను చేస్తారు. కోర్ట్ తీర్పులు వాయిదాలలో ఉండడం ఆలోచింప చేస్తుంది.



## కన్య

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటా, బయటా అనుకూలంగా ఉంటుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. ఆప్తుల నుండి కీలక విషయాలు తెలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. రాజకీయ కళారంగాల వారికి సన్మానాలు. ధన, వస్తు, లాభాలు పొందుతారు. చర్చల్లో పురోగతి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.



## తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది. సన్నిహితుల నుండి ముఖ్య మైన విషయాలు తెలుసుకుంటారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. భూ సంబంధ విషయాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటాయి. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు బదిలీల సూచన. రాజకీయ పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకమైన కాలం. శుభకార్యాలలో పాల్గొంటారు.



## వృశ్చికం

ఈ వారం కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆర్థిక విషయాలలో ఒడిదుడుకులు ఎదురైనా అధిగమిస్తారు. భూ వివాదాలు తీరి లబ్ది పొందుతారు. ఆరోగ్య, వాహనాల విషయంలో మెలకువ అవసరం. లక్ష్మీతామర వత్తులతో నిత్యం ఇష్టదైవం సన్నిధిలో దీపారాధన చేయండి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయగలుగుతారు. దూర ప్రయాణాలలో నూతన మిత్రులతో పరిచయాలు ఏర్పడతాయి. వృత్తి, వ్యాపారాలలో అనుకూలత ఆశించిన స్థాయిలో ఉంటుంది.



## ధనుస్సు

ఈ వారం విందు, వినోదాలు, విహారయాత్రలతో కాలాన్ని గడుపుతారు. పెరుగుతున్న ధరలు, రాబడి వంటి ఆర్థిక అంశాలు ఆలోచింప చేస్తాయి. సంతాన క్షేమాన్ని వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సొంత ధనాన్ని వారి పేరు మీద పొదుపు చేస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా మీ స్థాయి పెంపొందుతుంది. వ్యాపారస్తులకు లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. అరచేత వైకుంఠం చూపి మిమ్మల్ని మోసగించాలనుకునే వారు భంగపడ తారు. కట్టుదిట్టమైన ప్రణాళిక లను రూపొందించుకోగలుగుతారు.



## మకరం

ఈ వారం ప్రయాణాలు అలసటకు గురి చేస్తాయి. ప్రభుత్వపరమైన కార్యక్రమాలు సానుకూల పడతాయి. వ్యక్తిగత కుటుంబ సభ్యుల ఆరోగ్యం పైన దృష్టిని సారిస్తారు. విదేశాలలోని మీ వారి ఉన్నత స్థితి, వారు మీ పట్ల కనబరిచే ఆదరాభిమానాలు మిమ్మల్ని సంతోష పరుస్తాయి. ఒక వర్గంతో ఏర్పడిన విభేదాలను సర్దుబాటు చేసుకోవడానికి రాయబారాలను సాగిస్తారు. కుటుంబ సభ్యుల ప్రోద్బలం వలన ఒకరికి అయిష్టంగానే ఆర్థిక సహాయం చేయవలసి వచ్చే సూచనలు గోచరిస్తున్నాయి.



## కుంభం

ఈ వారం ఉన్నత విద్యావకాశాలు కలిసి వస్తాయి. కొత్త స్నేహాలు వృద్ధి చెందుతాయి. కీడెంచి మేలెంచమన్న విధంగా వ్యవహరిస్తారు. పెట్టుబడులు లాభిస్తాయి. అలంకారం పట్ల మక్కువ చూపుతారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేస్తారు. ఉన్నతాధి కారులతో సఖ్యత మరింత పెరుగుతుంది. కుటుంబ సభ్యుల సహాయసహకారాలను అందుకుంటారు. తక్కువ వ్యవధిలో సాగే తాత్కాలిక వ్యవహారాల పైన దృష్టిని సారిస్తారు. ఏ పనినైనా పూర్తిగా చేసేవరకు ఇతరులకు తెలియనివ్వకండి.



## మీనం

ఈ వారం ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పనులు సకాలంలో పూర్తి చేయగలుగుతారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. కుటుంబంలో నూతన బాధ్యతలను సక్ర మంగా నిర్వహిస్తారు. శ్రమకు తగిన ఫలితం పొందుతారు. దూరపు బంధువులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఇతరుల విషయా లలో జోక్యం వద్దు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. నూతన విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందుతారు. స్థలాలు, గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

# ఈ వారం కార్టూన్స్


ఫోన్లో బ్రైట్‌నెస్ పెంచినట్లు బయట పెంచడం కుదరదమ్మా.. బాగా మబ్బు పట్టి చీకటిగా ఉన్నింది!!


పార్కు
నీ ఏడుపే నా ఎదుగుదల
రేయ్.. దిష్టి పెట్టకురా..


ఇల్లు ఉంటేనే కరెంటిస్తామన్నారు.. సోలార్ పెట్టించేసా..!!





చైనాలోని యాంగ్గైటై గ్రామాన్ని టర్టిల్ విలేజ్ అని పిలుస్తుంటారు. ఇది తాబేలు ఆకారాన్ని పోలి వుండటం వల్ల ఆ పేరు వచ్చింది. వైవిధ్యంగా వున్న ఈ ఇళ్ల నిర్మాణం ప్రస్తుత గేటెడ్ కమ్యూనిటీ విలేజ్‌ని పోలి ఉందనటంలో అతిశయోక్తి లేదు.





